నేటి కందం- నేటికి అందం

తీరుగ భారత సైన్యము
పోరాటము లేని వేళ పొందిక తోడన్
నేరుగ దేశ జనాళికి
జోరుగ సేవల నొసంగి స్తుతు లందుకొనెన్ !!

(యుద్ధం లేని శాంతి సమయంలో భారత సైన్యం ప్రజలకు అవసరమైన సేవల నందించి వారి అభిమానాన్ని చూరగొని ప్రశంసలను అందుకుంటున్నది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

ఫలితాలు ఏమైనా
పురపోరులో తీర్పు
పట్టణాల అభివృద్ధికి
ప్రజలు కోరే మార్పు.
ప్రభుత్వం గుర్తించి
పనిచేస్తే మంచిపేరు
లేకుంటే అధికారం
లేచిపోయి చేజారు

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 14-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:154 పేజీలు:6 వెల: రూ.1/-

# మున్సిపల్ ఎన్నికలలో.. సత్తా చాటిన హస్తం పార్టీ

హైదరాబాద్, ఫిబ్రవరి 13: హైదరాబాద్, ఫిబ్రవరి 13: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మొత్తం 116 మున్సిపాలిటీలలోని 2,582 వార్డుల్లో ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో 1,347 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో 64 మున్సిపాలిటీలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. ఇక బీఆర్ఎస్ 717 వార్డుల్లో గెలుపొందింది. దాంతో 13 మున్సిపాలిటీలను ఆ పార్టీ దక్కించుకుంది. బీజేపీ 261 వార్డుల్లో గెలుపొందారు. స్వాతంత్ర అభ్యర్థులు.. 256 వార్డుల్లో విజయం సాధించారు.

38 మున్సిపాలిటీల్లో మాత్రం ఏ పార్టీకి పూర్తి స్థాయి మెజార్టీ రాలేదు. దీంతో హంగ్ ఏర్పడింది. మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకుంది. అలాగే జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి మద్దతుదారులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచి అత్యధిక స్థానాల్లో విజయం సాధించడం గమనార్హం.



# ప్రజా పాలన ఫలితమే ఈ విజయం: సీఎం రేవంత్ రెడ్డి..

హైదరాబాద్, ఫిబ్రవరి 13: తెలంగాణ మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితమని.. పార్టీ పట్ల వారికి ఉన్న అనంతమైన అభిమానానికి నిదర్శనవని కొనియాడారు. ఈ మేరకు



ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితమని రేవంత్ అన్నారు. రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేద- మధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని అన్నారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు రేవంత్. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితం అవుతామన్నారు. భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌ను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పుకొచ్చారు.

# ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టారు: మంత్రి జూపల్లి



హైదరాబాద్, ఫిబ్రవరి 13: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంది. హస్తం పార్టీ విజయంపై తెలంగాణ ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావుకీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్ వేదికగా మంత్రి జూపల్లి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌పై నమ్మకంతో మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఎన్నికలు ఏవైనా విజయం కాంగ్రెస్‌దేనని మరో సారి రుజువైందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారన్నారు.సీఎం రేవంత్ రెడ్డి సారథ్యం లోని ప్రజా ప్రభుత్వ పనితీరుకు ఈ ఫలితాలే నిదర్శనమని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పుకొచ్చారు. తమ పాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమష్టి విజయమన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు పట్టించుకోవడం లేదని చెప్పుకొచ్చారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ప్రజలు ఇదే తీర్పును ఇవ్వబోతున్నారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక మున్సిపల్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుందని తెలిపారు. కొల్లాపూర్ మున్సిపాలిటీలో 19 స్థానాలకు 16 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

# ఎన్నికల్లో ఓడిపోయామని బాధపడకండి.. గులాబీ శ్రేణులకు ధైర్యం చెప్పిన కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 13: మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించామని వ్యాఖ్యానించారు. తమ విజయంతో కాంగ్రెస్ నేతల నోళ్లు మూతపడ్డాయని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో మనం ఓడిపోయామని బాధపడొద్దని గులాబీ శ్రేణులకు ధైర్యం చెప్పారు. 'నేనే రాజు.. నేనే మంత్రి' అన్నవాళ్లు చరిత్రలో కలిశారని కేటీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు.మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ ఎస్ కార్యకర్తలు బాగా పనిచేశారని కేటీఆర్ ప్రశంసించారు. 117 స్థానాల్లో మాకు మంచి ఫలితాలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు. పలు జిల్లాల్లో అధికార దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని విమర్శించారు. సింగరేణి ప్రాంతంలో సీపీఐతో కలిసి పోటీ చేశామన్న కేటీఆర్.. కాంగ్రెస్, బీజేపీని అడ్డుకునేందుకే సీపీఐతో కలిసి పోరాడామని చెప్పుకొచ్చారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐకి మద్దతిచ్చామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రిని అభినందించిన ప్రియాంక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారు. హస్తినలో సీఎం పర్యటన షెడ్యూల్ బిజీ బిజీగా సాగుతోంది. రెండు రోజుల పర్యటనలో భాగంగా పలువురు నేతలతో రేవంత్ సమావేశమవుతున్నారు. ఇవాళ(శుక్రవారం) ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘన విజయంపై చర్చ జరిగింది.

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ సాధించిన విజయంపై ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాల్లో పార్టీకి వచ్చిన మద్దతు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయంతో పార్టీ కేడర్‌లో నూతన ఉత్సాహం నెలకొన్నదని, భవిష్యత్తు ఎన్నికల కోసం ఇది బలమైన పునాది అని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రియాంక గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలోపేతం చేయడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. పార్టీ శ్రేణులతో సమన్వయం, ఎన్నికల వ్యూహ రచన, స్థానిక స్థాయిలో బలమైన ప్రచారం ఇవి విజయానికి దోహదపడ్డాయని ఆమె అభిప్రాయపడ్డారు.

## సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

ఈ సందర్భంగా సీఎం రేవంత్ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రియాంక గాంధీకి వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం వల్లే పట్టణ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం కట్టబెట్టారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ కావడం, పారదర్శక పాలన అందించడం వల్ల ప్రజలు కాంగ్రెస్ పాలనపై సంతృప్తిగా ఉన్నారని ఆయన వివరించారు.

## కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి

ఈ భేటీలో తెలంగాణలో హస్తం పార్టీ బలోపేతం కావడంపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ శక్తిని మరింత పెంచే దిశగా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించినట్లు సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్ విజయవంతమైన పాలన కొనసాగించేందుకు కేంద్ర నాయకత్వం సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆమె హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సమావేశం తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. మున్సిపల్ ఎన్నికల విజయంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తన ఆధిపత్యాన్ని మరింత బలపరిచినట్లు సంకేతాలు అందుతున్నాయి. మొత్తంగా, ఢిల్లీలో జరిగిన ఈ భేటీ కాంగ్రెస్ కు కొత్త ఉత్సాహాన్ని నింపినట్లుగా కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి.

# స్వేచ్ఛ.. శాంతికే పట్టం

## -బంగ్లాదేశ్.. ఫస్ట్ ..పాలసీ బెస్ట్.. ఎన్నికల్లో బీఎన్‌పీ ప్రభంజనం

హైదరాబాద్, ఫిబ్రవరి 13: ఇటు మితిమీరిన నిరుద్యోగం. అటు ఆర్థిక సంక్షోభం. మరో వైపు అంతులేని హింస.. భరించలేక నానా తంటాలు పడుతున్న బంగ్లాదేశ్? ప్రజలు.. శాంతి, స్వేచ్ఛకే పట్టం కట్టారు. బంగ్లా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. 2026 ఫిబ్రవరి 12,న జరిగిన బంగ్లాదేశ్ సాధారణ ఎన్నికలలో తారిక్ రెహ్మాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. మొత్తం 299 స్థానాలకు గాను బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ 213 స్థానాల్లో విజయ ఢంకా మోగించి. మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించింది. 11 పార్టీల ఇస్లామిక్ కూటమి కి నాయకత్వం వహించిన జమాతే-ఇ-ఇస్లామి పార్టీ 70 స్థానాలను గెలుచుకుని దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. 2024 విద్యార్థి ఉద్యమం నుండి పుట్టుకొచ్చిన నేషనల్ సిటిజన్ పార్టీ (ఔఅఖ) తొలిసారిగా 6 స్థానాలను గెలుచుకుని పార్లమెంటులో అడుగుపెట్టబోతోంది.

### శాంతి స్వేచ్ఛకే పట్టం

గత రెండేళ్లుగా విద్యార్థి ఉద్యమం, మతవాదన పార్టీల అలజడితో బంగ్లాదేశ్ అట్టుడిగిపోయింది. నిత్యం హింసతో జనం అల్లాడిపోయారు. తత్కాలిక ప్రభుత్వం ఈ హింసను అడ్డుకోవటంలో విఫలమైంది. కానీ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహణలో సత్ఫలితాలు ఇచ్చింది. ఇక అవినీతి, అసమర్థ పాలనతో సతమతమవుతున్న తరుణంలో.. దాదాపు 17 ఏళ్ల సుదీర్ఘ ప్రవాసం తర్వాత బంగ్లాదేశ్ కు తిరిగి వచ్చిన బీఎన్ పీ అధినేత తారిక్ రెహమాన ప్రధానిగా పీఠాన్ని అధిష్టించనున్నారు. బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ పార్టీ అధినేత్రి హసీనా బేగంపై తిరుగుబాటు.. అనంతరం జరిగిన పరిణామాలను పక్కన పెడితే.. 2025 డిసెంబర్ 25 నుంచి బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చారు. షేక్ హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత, దేశంలో ఏర్పడిన రాజకీయ అనిశ్చితిని తొలగించగల నాయకుడిగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ శ్రేణులు తారిక్ రెహమాన్ ను గుర్తించాయి. ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టాయి. తారిక్ రెహ్మాన్ స్వయంగా బొగురా-6 , డాకా- 17 నియోజకవర్గాల నుండి భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఫిబ్రవరి 14న ఆయన ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని నివేదికలు తెలుపుతున్నాయి.

### హసీనాపై తిరుగుబాటు

బంగ్లాదేశ్‌లో సుమారు 15 ఏళ్లపాటు తిరుగులేని శక్తిగా వెలుగొందిన షేక్ హసీనా ప్రభుత్వం 2024 ఆగస్టులో పతనం కాక తప్పలేదు. హసీనా ప్రభుత్వం పతనానికి కోటా సంస్కరణల ఉద్యమం నాంది పలికింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో 1971 స్వాతంత్ర్య సమర యోధుల వారసులకు 30% రిజర్వేషన్లు కల్పించే విధానాన్ని విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విధానం మెరిట్‌కు అన్యాయం చేస్తోందని, కేవలం హసీనా అనుకూల వర్గాలకే మేలు చేస్తుందని నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. శాంతియుతంగా ప్రారంభమైన విద్యార్థి నిరసనలను ప్రభుత్వం బలవంతంగా అణిచివేయాలని



చూసింది.

పోలీసుల కాల్పులు, హింసాత్మక చర్యలతో వందలాది మంది విద్యార్థులు మరణించడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. ఇది కాస్తా 'హసీనా రాజీనామా' అనే ఏకైక డిమాండ్‌తో ప్రజా ఉద్యమంగా మారింది. దేశంలో నిరుద్యోగం పెరగడం, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆర్థిక వృద్ధి జరుగుతున్నట్లు కనిపించినా, ఆ సంపద కేవలం అధికార పార్టీకి దగ్గరగా ఉన్నవారికే చేరుతోందనే విమర్శలు వచ్చాయి. హసీనా ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని, ప్రతిపక్షాలను అణచివేస్తోందని ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి జరిగిందని, అక్రమంగా సంపదను విదేశాలకు తరలించారని ఆరోపణలు ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. 2024 జనవరిలో జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్షాలు పాల్గొనకపోవడం, ఆ ఎన్నికలు పారదర్శకంగా జరగలేదనే ఆరోపణలు హసీనా ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీశాయి. చివరగా, నిరసనకారులపై కాల్పులు జరపడానికి సైన్యం నిరాకరించటంతో పరిస్థితి చేయి దాటిపోవడంతో హసీనాకు రాజీనామా చేసి దేశం విడవక తప్పలేదు. ఈ కారణాలన్నీ కలిసి బంగ్లాదేశ్‌లో ఒక భారీ ప్రజా విప్లవానికి దారితీసి, షేక్ హసీనా సుదీర్ఘ పాలనకు ముగింపు పలికాయి.

# కాంగ్రెస్ దౌర్జన్యంతో గెలిచింది: రాంచందర్ రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 13: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పందించారు. బీజేపీని ఓడించేందుకు ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయంటూ ఆరోపించారు. 'మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓట్ల శాతం పెరిగింది. దాదాపు 350 వార్డుల్లో మనం సత్తా చాటబోతున్నాం. అధికార దుర్వినియోగం, పోలీసుల దౌర్జన్యంతో కాంగ్రెస్ గెలిచింది.

నారాయణపేట, ఆదిలాబాద్, కొత్తగూడెం, వైరాలో తొలిసారి విజయం సాధించాం. చాలా వార్డుల్లో 2 నుంచి 25 ఓట్ల తేడాతో ఓడిపోయాం. ఈ ఎన్నికల్లో బీజేపీ బలం పెరిగింది.. ఃఖీూ ఓట్ల శాతం తగ్గింది. 20 శాతం ఓట్లు బీజేపీకి పెరిగాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ నైతికంగా విజయం సాధించింది. ఈ ఫలితాలు అధికార పార్టీకి హెచ్చరిక. క్షేత్రస్థాయిలో బీజేపీ బలం పుంజుకుంది' అని అన్నారు.

# మణిపూర్‌లో మరోసారి చెలరేగిన హింస.. రెండు ఇండ్లు దహనం చేసిన ఆందోళనకారులు

మణిపూర్‌ల ఫిబ్రవరి 13: ఆందోళనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. గురువారం ఉఖ్రుల్ జిల్లాలోని, లిటన్ ఏరియాలో ఆందోళనకారులు రెండు ఇండ్లను తగలబెట్టారు. స్థానికంగా ఉన్న సరీఖాంగ్ గ్రామంలో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో ఈ హింసాత్మక ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. అంతకుముందు 24 గంటలపాటు మణిపూర్‌లో ప్రశాంత వాతావరణమే కొనసాగింది.

కానీ, గురువారం తిరిగి హింస చెలరేగింది. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు మోహరించి ఉన్నప్పటికీ కొన్ని చోట్ల ఆందోళనలు ఆగడం లేదు. మరోవైపు ఉదయం ఎనిమిది గంటల సమయంలో తుపాకీ కాల్పుల మోతలు కూడా వినిపించాయని పోలీసులు తెలిపారు. అయితే, ఎవరూ గాయపడటం లేదా మరణించడం వంటివి తమ దృష్టికి రాలేదన్నారు. తాజా హింసకు ఈ ప్రాంతంలోని రెండు వర్గాలకు చెందిన వారు మద్యం సేవించడమే కారణం. ఆదివారం రాత్రి తంకుల్ నాగా, కుకీ తెగలకు చెందిన వారు మద్యం మత్తులో గొడవపడ్డారు. సమీప గ్రామాలకు చెందిన ఈ రెండు వర్గాల వారి మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్ర రూపం దాల్చింది. ఈ హింసలో ఇరు వర్గాలకు చెందిన 40 ఇండ్లను ఆందోళనకారులు దహనం చేశారు.

వెంటనే స్పందించిన పోలీసులు ఈ ప్రాంతంలో ఘర్షణలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా కర్ఫ్యూ విధించారు. లిటన్ ఏరియాతోపాటు జిల్లా మొత్తం ఇంటర్నెట్ తొలగించారు. అయినప్పటికీ కుకీ తెగకు చెందిన మహిళలు చురాచంద్‌పూర్ జిల్లాలో భారీ నిరసనలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఎల్‌ఎం ఖవుతే ప్రభుత్వంలో చేరడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు.

# మున్సిపాలిటీలను సమగ్రంగా అభివృద్ధి చేస్తాం-జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఫిబ్రవరి 13: సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. ఈ విజయంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి, ఘనమైన విజయాన్ని అందించిన ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 'పార్టీ అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలు శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.మ్యాచ్‌లకు ప్రభుత్వం గ్రీన్ సి

అలాగే 'నేను ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాను' అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో ఈ రెండు మున్సిపాలిటీలను సమగ్రంగా అభివృద్ధి చేస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ హామీ ఇచ్చారు.కాగా.. సంగారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 38 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 22 వార్డుల్లో విజయం సాధించింది. అలాగే బీఆర్ఎస్ 10, బీజేపీ 2 స్థానాల్లో గెలవగా.. ఇతరులు 4 వార్డుల్లో గెలిచారు. దీంతో ఛైర్మన్ పదవి కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లింది. సదాశివపేటలో మొత్తం 26 వార్డుల్లో కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 8 వార్డుల్లో విజయం సాధించింది. బీజేపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఒక్కో స్థానం దక్కించుకున్నారు. ఈ రెండు మున్సిపాలిటీల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు ఇంటింటా ప్రచారం చేసి అభ్యర్థుల విజయానికి కీలక పాత్ర పోషించారు.



# గుండె జబ్బులతో చిన్నారుల జీవితాలు ఛిద్రం

## (14 ఫిబ్రవరి "అంతర్జాతీయ పుట్టుకతో వచ్చే గుండె లోపాల అవగాహన దినం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా ఒక శాతం శిశువులు, మొత్తంగా మిలియన్ల కొద్ది పిల్లలు, ఇండియాలో కనీసం 2 లక్షల శిశువులు 'పుట్టుకతోనే గుండె లోపాల'తో జన్మించడంతో వారి నిండు నూరేళ్ల జీవితం ప్రశ్నార్థకంగా మారడం, ఆ రోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు నరకయాతనను అనుభవించడం చూస్తున్నాం. జన్మత గుండె లోపాలతో పుట్టిన పిల్లల్లో 20 శాతం వరకు తీవ్రమైన హృదయ అనారోగ్యాలతో జీవిస్తూ, అకాలమరణాల బారిన కూడా పడడం జరుగుతున్నది. పుట్టుకతో గుండె లోపాలతో జన్మించిన పిల్లలకు గుండె పని తీరులో ఇబ్బందులు, రక్త ప్రసరణ లోపాలు, శారీర అభివృద్ధి మందగించడం, దీర్ఘకాలిక గుండె అనారోగ్యాలు, స్ట్రోక్స్, గుండె ఫెయిల్యూర్ లాంటి అనారోగ్యాలు కలుగుతున్నాయి.

### అంతర్జాతీయ పుట్టుకతో వచ్చే గుండె లోపాల అవగాహన దినం:

పుట్టుకతో వచ్చే గుండె లోపాల గూర్చి పూర్తి అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 14 ఫిబ్రవరిన "అంతర్జాతీయ పుట్టుకతో వచ్చే గుండె లోపాల అవగాహన దినం (ఇంటర్నేషనల్ కాన్‌జెనిటల్ హార్ట్ డిఫెక్ట్స్ అవేర్‌నెస్ డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

2025 అంతర్జాతీయ పుట్టుకతో వచ్చే గుండె లోపాల అవగాహన దినం ఇతివృత్తంగా "గుండె బలోపేతం : ప్రారంభ దశలో గుర్తింపు, సకాలంలో వైద్యం, జీవితకాల చేయూత'' అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

పుట్టుకతో వచ్చే గుండె లోపాలు రావడానికి కారణాలుగా జన్యుపరమైన అంశాలు, పర్యావరణ కాలుష్యానికి దీర్ఘకాలం గురికావడం, తల్లి అనారోగ్యం లేదా పోషకాహార లోపాలు, గర్భవతులు ప్రత్యేక ఔషధాలను వాడడంతో శిశువుపై దాని ప్రతికూల ప్రభావం పడడం లాంటివి గుర్తించారు.

పుట్టుకతో వచ్చే గుండె లోపాలను నివారించడానికి ఆస్కారం తక్కువగా ఉన్నందున తొలి దశలోనే గుర్తించి, తగు వైద్య సూచనలు పాటించడంతో వారి జీవితకాలం పొడిగించబడడంతో పాటు ఆరోగ్యంగా గడిపే సదవకాశం ఉంటుంది.

ఇలాంటి ప్రమాదక లోపాల పట్ల లోతైన పరిశోధనలు, తరుచుగా వైద్య సలహాలు, తొలి దశలో గుర్తించడం, సరైన సమయంలో సరైన చికిత్స తీసుకోవడం, ప్రజల్లో అవగాహన కల్పించడం, రోగులతో పాటు వారి కుటుంబాలను ఆదుకోవడం, వ్యాప్తిని తగ్గించడం లాంటివి పాటించడం ఉత్తమం అని నిపుణులు సూచిస్తున్నారు.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భారతదేశ పరిపాలనా వ్యవస్థ నిర్మాణంలో విప్లవాత్మక ఘట్టాన్ని సూచించే ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: ఫిబ్రవరి 13, 2026న మధ్యాహ్నం సుమారు 1:30 గంటలకు సేవా తీర్థ్ భవన సముదాయం పేరును ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆవిష్కరిస్తారు. అనంతరం ప్రధానమంత్రి.. సేవా తీర్థ్, కర్తవ్య భవన్-1, 2లను అధికారికంగా ప్రారంభిస్తారు. సాయంత్రం సుమారు 6 గంటలకు సేవా తీర్థ్ వద్ద బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

ఈ ప్రారంభోత్సవం భారతదేశ పరిపాలనా వ్యవస్థ నిర్మాణంలో విప్లవాత్మక ఘట్టాన్ని సూచించటమే కాక.. ఆధునిక, సమర్థవంతమైన, సులభతరమైన, పౌరులే కేంద్రంగా పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయటానికి ప్రధానమంత్రి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తుంది.

కేంద్ర ప్రభుత్వ కీలక కార్యాలయాలు, మంత్రిత్వ శాఖలు దశాబ్దాల తరబడి సెంట్రల్ విస్టా ప్రాంతంలో పలుచోట్ల పాత, వేర్వేరు భవనాల్లో పనిచేశాయి. కార్యాలయాలు వేర్వేరు చోట్ల ఉండటం వల్ల పరిపాలనా సామర్థ్యం తగ్గటం, సమన్వయ లోపాలు, నిర్వహణ ఖర్చులు పెరగటం, అసౌకర్యవంతమైన పని వాతావరణ వంటి సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యలకు పరిష్కారంగా కొత్తగా నిర్మించిన భవన సముదాయాలు.. పరిపాలనా విధులను ఆధునిక, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాయి.

గతంలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న ప్రధానమంత్రి కార్యాలయం, జాతీయ భద్రతా మండలి సచివాలయం, కేబినెట్ సచివాలయాలు ఇకపై సేవా తీర్థ్‌లో ఉంటాయి.

ఆర్థిక మంత్రిత్వ శాఖ, రక్షణ, కుటుంబ సంక్షేమ, కార్పొరేట్ వ్యవహారాలు, విద్య, సంస్కృతి, న్యాయ, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, వ్యవసాయ, రైతు సంక్షేమ, రసాయనాలు, ఎరువులు, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలతో సహా పలు కీలక మంత్రిత్వ శాఖలు కర్తవ్య భవన్-1, 2లో ఉంటాయి.

ఈ భవన సముదాయాల్లో డిజిటల్ సదుపాయాలున్న కార్యాలయాలు, పౌర సేవా విభాగాలు, కేంద్రీకృత రిసెప్షన్ సౌకర్యాలున్నాయి. ఈ ప్రత్యేక వసతులు ఉద్యోగుల మధ్య సహకారాన్ని, పనితీరులో సామర్థ్యాన్ని పెంపొందించటమే కాక, పారదర్శకమైన పాలన, మెరుగైన పౌర భాగస్వామ్యం, ఉద్యోగుల సంక్షేమానికి తోడ్పడతాయి. 4 స్టార్ గృహ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఈ భవనాల్లో పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, నీటి సంరక్షణ చర్యలు, వ్యర్థాల నిర్వహణ పరిష్కారాలు, అత్యుత్తమ నిర్మాణ శైలి వంటి పర్యావరణహితమైన వసతులున్నాయి. ఈ చర్యలు పర్యావరణంపై ప్రభావాన్ని గణనీయంగా తగ్గించడమే కాక, పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఈ భవన సముదాయాల్లో స్మార్ట్ యాక్సెస్ కంట్రోల్ సిస్టమ్స్, నిఘా వ్యవస్థలు, అత్యాధునిక అత్యవసర ప్రతిస్పందన మౌలిక సదుపాయాల వంటి సమగ్ర భద్రతా వ్యవస్థలున్నాయి. ఇవి అధికారులు, సందర్శకులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తాయి.

# యూరియా కోసం పురుగుమందు డబ్బాలతో రైతుల నిరసన



నల్గొండ, ఫిబ్రవరి 13: రైతులకు యూరియా కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. రైతులు ఎవరూ క్యూలైన్‌లో కనిపించకూడదని భావించిన ప్రభుత్వం యాప్ ను అందుబాటులో తెచ్చింది. యాప్ లో సైతం రైతులకు యూరియా బుక్ అవ్వక నానా అవస్థలు పడుతున్నారు. సెల్ ఫోన్ చేతిలో పట్టుకుని గంటలకొద్ది నిరీక్షించినా ఒక్క యూరియా కట్ట కూడా బుక్ కాకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న స్టాక్ అంతా క్షణాల్లోనే మాయమై పోతుండడంతో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన రైతులకు యూరియా ఆన్‌లైన్‌లో బుక్ కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం నిరసనకు దిగారు. కోదాడ- అనంతగిరి రోడ్డుపై పురుగుమందు డబ్బాలతో బైఠాయించి నిరసన తెలిపారు.

అనంతరం ఖానాపురం ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో వ్యవసాయ అధికారులను నిలదీశారు. సంఘం పరిధిలోకి 444 యూరియా కట్టలు ఆన్‌లైన్‌లో వచ్చినప్పటికీ తమకు ఒక కట్ట కూడా బుక్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

యూరియా కట్టలు ఆన్‌లైన్లో పెడతామన్న సమయానికి కాకుండా ఆలస్యంగా ఆన్‌లైన్‌లో ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతి సీజన్‌లో యూరియా విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సంఘం కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు.

# మార్చి 19న ఢిల్లీలో ముగింపు




అమరావతి, ఫిబ్రవరి 13: జాతీయ కిసాన్ జాగృతి యాత్రకు కిసాన్ కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి తెలియజేశారు. కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బి క్రాంతి నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్టియు భవన్ లో జరిగిన అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో జాతీయ కిసాన్ జాగృతి యాత్ర ఫిబ్రవరి 7న ప్రారంభమై కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు దేశ వ్యాప్తంగా 40 రోజులు చేపట్టి మార్చి 19న ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో ముగింపు సభ ఉంటుందన్నారు.

ఈ యాత్రలో కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి జాతీయ రైతు సంఘం నాయకులు ఈ యాత్రకు రావడం జరుగుతుందన్నారు. ఢిల్లీలో రైతు సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున సంయుక్త కిసాన్ మోర్చా 525 సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతు ఉద్యమం 13 నెలలు జరిగిందన్నారు. ఆ ఉద్యమంలో జాతీయ రైతు నాయకులు జల్బీర్ సింగ్ జలేవాల 130 రోజులు నిరాహార దీక్ష చేపట్టిన సందర్భంగా బీజేపీ నరేంద్ర మోదీ ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇచ్చిందని చెప్పారు.

మరల బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టి 20 నెలలు గడచినా రైతు సమస్యలు అమలు చేయని కారణంగా అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో జాతీయ కిసాన్ జాగృతి యాత్ర చేపట్టవలసి వచ్చిందన్నారు. ప్రధాన డిమాండ్లు వ్యవసాయ రంగానికి డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని రైతులు పండించిన అన్ని రకాల పంటలకుఅ2+50 శాతం గిట్టుబాటు ధరలు కల్పించి ఆ ధరలను చట్టబద్ధం చేయాలన్నారు.

2023 విద్యుత్ సవరణ చట్టాలను రద్దుచేసి ఉచిత విద్యుత్ విధానాన్ని అమలు చేయాలని, 2025 విత్తన చట్టాన్ని రద్దు చేయాలని, విబిజీ రాంజీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలన్నారు. జాతీయ కిసాన్ జాగృతి యాత్ర చేపట్టడం జరుగుతుందని సూర్యప్రకాశ్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ జగ్జిత్ సింగ్ దళివాల, రాజస్థాన్ ఇందర్జిత్ ఫన్నీ వాళ, హర్యానా అభినయ కోహర్, మొదలగు వారు పాల్గొన్నారు.

# బడ్జెట్ మన దేశ ప్రజల ఆర్థిక స్థితిలో మార్పులకు ఎలా తోడ్పడుతుందో ఆర్థిక మంత్రి సమగ్రంగా వివరించారు: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: మన దేశ ప్రజల ఆర్థిక స్థితిని మార్చడానికి ఈ సంవత్సర బడ్జెట్ ఏ విధంగా తోడ్పడుతుందో ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు లోక్‌సభ దృష్టికి తీసుకువచ్చారని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. "రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్ గురించీ, సూక్ష్మ- చిన్న- మధ్యతరహా సంస్థలకు మద్దతు, నైపుణ్యాలకు సాన పట్టడం, రాబోయే కాలం అవసరాలను తీర్చగలిగేలా మౌలిక సదుపాయాల కల్పన , ఆరోగ్య సంరక్షణ , విద్య తదితర రంగాలకు ఊతాన్ని ఇచ్చే దిశగా చేస్తున్న కృషిని ఆమె స్పష్టం చేశారు" అని శ్రీ మోదీ వివరించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో శ్రీ మోదీ ఒక సందేశాన్ని పొందుపరుస్తూ -

మన దేశ ప్రజల ఆర్థిక స్థితిని మార్చడానికి ఈ సంవత్సర బడ్జెట్ ఏ విధంగా తోడ్పడుతున్నదీ ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో తన ప్రసంగంలో సమగ్రంగా వివరించారు. రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్ గురించీ, సూక్ష్మ- చిన్న- మధ్యతరహా సంస్థలకు మద్దతు, నైపుణ్యాలకు పదును పెట్టడం, రాబోయే కాలం అవసరాల్ని తీర్చగలిగే దిశగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, విద్య, తదితర రంగాలకు ఊతాన్ని అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు'' అని పేర్కొన్నారు.

# విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు పెంచుకోవడం అత్యవసరం..!

నల్గొండ, ఫిబ్రవరి 13: ప్రస్తుత గ్లోబల్ యుగంలో విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు పెంచుకోవడం అత్యంత అవసరమని ఇంగ్లీష్ ఉపాధ్యాయులు నర్సింలు గౌడ్, సంజీవులు అన్నారు. రాయపోల్ మండలం బేగంపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఇంగ్లీష్ డే నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఇంగ్లీష్ భాష ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు రంగవల్లులు వేయగా, సందేశాత్మక చిత్రాలు ఆకట్టుకున్నాయి.

ఇంగ్లీష్ డేను పురస్కరించుకొని విద్యార్థులు ఇంగ్లీష్‌లో ప్రసంగాలు ఇచ్చారు. కొందరు కవితా పఠనం, సంభాషణలు, వ్యాసరచన వంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు, సాంకేతిక రంగాల్లో రాణించాలంటే ఇంగ్లీష్ భాషలో నైపుణ్యం అవసరమని పేర్కొన్నారు.

రోజువారీ జీవితంలో ఇంగ్లీష్ మాట్లాడే అలవాటు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ప్రమీల ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

ఇంగ్లీష్‌పై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

# శాంతి చట్టం అమలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: భారత రాష్ట్రపతి ఆమోదం పొందిన శాంతి చట్టాన్ని 20 డిసెంబర్ 2025న గెజిట్‌లో ప్రచురించారు. అయితే ఇప్పటివరకు ఈ చట్టంలోని నియమాలు, నిబంధనలు, విధానాలు, నిబంధనల అమలుకు సంబంధించిన కాలక్రమాలేవీ ప్రభుత్వం నోటిఫై చేయలేదు.

శాంతి చట్టం-2025 చట్టంలోని నిబంధనలను సమర్థంగా అమలు చేయడం కోసం నియమాలు, నిబంధనలు, విధానాలను రూపొందించాలనే నిబంధన ఉంది. శాంతి చట్టం కేంద్ర ప్రభుత్వానికి తన అధికారాన్ని వినియోగించుకోవడానికి, దాని విధులను నిర్వర్తించడానికి డైరెక్టరేట్లు, వింగ్స్, విభాగాలను ఏర్పాటు చేసేందుకు అధికారం కల్పిస్తుంది. రేడియేషన్ అత్యవసర సమయంలో భద్రత, రక్షణ, నష్టనివారణ చర్యలను, ఏజెన్సీల మధ్య సమన్వయాన్నీ సమర్థంగా అమలు చేయడం... లైసెన్సుదారులు, భద్రతా అధికారాన్ని కలిగి ఉన్న వారి బాధ్యతలను నిర్ణయించడం వంటివి దీనిలో భాగంగా ఉన్నాయి.

జాతీయ లక్ష్యాలను చేరుకోవడం లక్ష్యంగా అణు ఇంధన వాటాను పెంచడం కోసం భద్రత, రక్షణ, నష్టనివారణ చర్యలు, అణు నష్టానికి పౌర బాధ్యత వంటి రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ నిబద్ధతలను పూర్తిగా పాటించే విధంగా చట్టపరమైన విధానంలో ముఖ్యమైన పౌర అణు సహకార అంశాలను శాంతి చట్టం సమలేఖనం చేసింది.

అణు విద్యుత్ ఉత్పత్తి, ఆరోగ్య సంరక్షణ, ఆహారం, నీరు, వ్యవసాయం, పరిశోధన, పరిశ్రమ, పర్యావరణం, అణు శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానంలో ఆవిష్కరణల ద్వారా భారత ప్రజల సంక్షేమం కోసం అణు ఇంధనాన్ని, అయనీకరణ రేడియేషన్‌లను ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడం, ఉపయోగించడం కోసం శాంతి చట్టం చట్టపరమైన విధానాన్ని అందిస్తుంది.

ఈ సమాచారాన్ని సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, ప్రధానమంత్రి కార్యాలయ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ఈ రోజు రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

# కేయూలో జాతీయ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ



హన్మకొండ, ఫిబ్రవరి 13: మార్చి 16, 17 తేదీలలో కాకతీయ విశ్వవిద్యాలయ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'కరెంట్ రీసెర్చ్ ఇన్ కెమికల్ సైన్సెస్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్లు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఎన్.వాసుదేవరెడ్డి, డీన్ జి.హనుమంతు, టి.సవితాజ్యోత్స్న, ఎస్.జ్యోతి, పాలక మండలి సభ్యురాలు బి. రమ, ఆర్.మల్లికార్జున రెడ్డి, కె.మమత, ఎస్.రంగారెడ్డి, ఎన్.శ్రీనివాస్, కవిత, వినుత, నాగేశ్వర్‌రావు, సృజన, విభాగ బోధనా సిబ్బంది పాల్గొన్నారు. ఈ జాతీయ సదస్సు ద్వారా రసాయన శాస్త్రంలో తాజా పరిశోధన ధోరణులు, ఆధునిక ఆవిష్కరణలు, శాస్త్రీయ అభివృద్ధిపై విశ్లేషణాత్మక చర్చలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# సంక్షేమం...అభివృద్ధిలో ముందంజ..

కర్నూలు ఫిబ్రవరి 13: తెలుగుదేశం పార్టీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ రోజు స్థానిక కార్యాలయంలో పాత్రికేయులతో మాటాడారు. రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ కలిసి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి ప్రజల విశ్వాసం పొందినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, అలాగే కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకం ద్వారా వేల కోట్ల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. శ్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు కోట్ల సంఖ్యలో ఉచిత బస్సు ప్రయాణాలు కల్పించడంతో పాటు, దీపం పథకం కింద సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరిగిందన్నారు.

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందించగా, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లక్షలాది మందికి అందుతున్నాయని వివరించారు. దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం, మత్స్యకారులకు వార్షిక ఆర్థిక సాయం, నేతన్నలకు ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లకు వార్షిక భృతి వంటి పథకాల ద్వారా వివిధ వర్గాలకు లబ్ధి చేకూరిందన్నారు. అన్నా క్యాంటీన్ల ద్వారా కోట్ల సంఖ్యలో భోజనాలు అందించడంతో పాటు, గీత కార్మికులు, స్వర్ణకారులు, పాస్టర్లు, ఇమాములు, అర్చకులు, నాయీబ్రాహ్మణులు, జూనియర్ న్యాయవాదులకు గౌరవ వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు.



# అసెంబ్లీని ముట్టడిస్తాం పోరాటమే శరణ్యం..

## -రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు..

అమరావతి, ఫిబ్రవరి 13: : ఉమ్మడి కూటమి




గెలుపునకు ఉపాధ్యాయులు ఎంతో కష్టపడి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నామన్నారు. కానీ ఏ ఒక్క సమస్య పరిష్కారం కావటం లేదని ఆర్థిక సమస్యలతో ఉపాధ్యాయులు లాడిపోతున్నారని కలెక్టరేట్ ఎదురుగా ధర్నా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన దశాలవారి పోరాటంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు ఎస్.చంద్ర శేఖర్, ప్రధానా కార్యదర్శి యం. అజాం బేగ్ ల ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర నాయకులు శివ శంకర్, గిరిబొయిన నాగేంద్ర కుమార్, ఈవీ గోపాలకృష్ణ మౌలాలి, ప్రసాదరెడ్డి అమిర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ? సమస్యల పరిష్కారం కోసం మోకాళ్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 12వ వేతన సవరణ కమిషన్ నియమిస్తామని, మధ్యంతర భృతి చెల్లిస్తామని, కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులకు ఆమోద యోగ్యమైన విధాన్నని రూపొందిస్తామని, 34 వెల కోట్ల రూపాయలు అరియర్స్ బకాయిల చెల్లింపులకు రోడ్ మ్యాప్ తయారు చేస్తామని, క్రమం తప్పకుండా కేంద్రంతో పాటు కరువు భత్యాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీలు ఏమాత్రం నెరవేరలేదని వాపోయారు.

ఎన్నికల ముందు ఉద్యోగులను ఉపాధ్యాయులను నమ్మబలికి తీయని మాటలు చెప్పి గద్దె ఎక్కిన తరువాత ఉద్యోగులు గుర్తుచేస్తూ ప్రాతినిధ్యాలు చేస్తే ప్రభుత్వం పెడచెవ్విన పెట్టడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. హెల్త్ స్కీం కొరకు ఉద్యోగుల నెల జీతాలనుండి మినహాయింపులు చేస్తున్న ఈహెచ్ఎస్ విధానంలో ఎలాంటి పురోగతి లేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంటు గరిష్ట పరిమితి 2 లక్షలు దాటాక పోవడంతో ఉద్యోగులు ఆర్థికంగా అప్పుల పాలు అవుచున్నారని విమర్శించారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులు మరణించి కారుణ్య నియామకాలు లేక అల్లాడుతుంటే ప్రభుత్వాలకు చీమకుట్టినట్లుగా లేకపోవడం దారుణమన్నారు.

ఈ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల న్యాయ సమ్మతమైన డిమాండ్ల పరిస్కారానికి ప్రత్యేక చొరవ చూపకపోతే ఈనెల 25న అసెంబ్లీని ముట్టడిస్తామని, అవసరం అయితే మొరొక భారీ తరహా ఉద్యమానికి వెనకాడమని హెచ్చరించారు. జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ కు వినతి పత్రాన్నిఅందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు డి.మౌలాలి టి.నూరుల్లా జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ ఎస్. అమిర్, జి.నాగేంద్రకుమార్, వై.ప్రసాద్,పి.శ్రీనివాస రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# 2031-32 నాటికి మూడు రెట్లు పెరగనున్న ఉత్పత్తి సామర్థ్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ విజ్ఞాన శాఖ సహాయమంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఇవాళ రాజ్యసభలో కీలక ప్రకటన చేశారు. విధానపరమైన సంస్కరణలు, ప్రైవేట్ భాగస్వామ్యం, 2047 వరకు నిర్దేశించుకున్న స్పష్టమైన సామర్థ్య లక్ష్యాల మద్దతుతో.. భారతదేశ అణుశక్తి కార్యక్రమం ప్రస్తుతం నిర్ణయాత్మకమైన విస్తరణ దశలో ఉందని వెల్లడించారు.

2014లో 4,780 ఎండబ్ల్యూగా ఉన్న భారత అణుశక్తి సామర్థ్యం ప్రస్తుతం 8,780 ఎండబ్ల్యూకి పెరిగిందని మంత్రి తెలిపారు. ఇది 2031-32 నాటికి 22,380 ఎండబ్ల్యూకు, 2037 నాటికి 47 జీడబ్ల్యూకు, 2042 నాటికి 67 జీడబ్ల్యూకు, 2047 నాటికి 100 జీడబ్ల్యూకి చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. భారతదేశం స్వావలంబన దిశగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని, భౌగోళిక రాజకీయ పరిణామాలు ప్రస్తుతం కొనసాగుతున్న అణుశక్తి ప్రాజెక్టులను అడ్డుకోలేవని స్పష్టం చేశారు.

ఆర్. గిరిరాజన్, జైరాం రమేశ్, రాంగోపాల్ యాదవ్, ఎం. తంబిదురైలు లేవనెత్తిన అనుబంధ ప్రశ్నలకు సమాధానమిస్తూ.. ప్రాజెక్టుల కాలపరిమితి, అంతరాజతీయ చర్చలు, ఇంధన భద్రత, సీఎస్ఆర్ కార్యక్రమాలు, విద్యుత్ పంపిణీ ఒప్పందాలకు సంబంధించిన అంశాలను మంత్రి వివరించారు.

కూడంకుళం అణు విద్యుత్ కేంద్రంపై వచ్చిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. 3, 4 యూనిట్ల పనులను 2026-27 నాటికి.. 5, 6 యూనిట్ల పనులను 2030 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. భారత్- అమెరికా సంబంధాల్లో మార్పుల తో సహా, ఇటీవల భౌగోళిక రాజకీయ పరిణామాల వల్ల ఈ ప్రాజెక్టులకు అంతరాయం కలుగుతుందన్న ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టు చరిత్రను వివరిస్తూ కూడంకుళం ప్రాజెక్టు 1988లో రూపదిద్దుకోగా 2002లో నిర్మాణ పనులు ప్రారంభమై, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 2014లో మొదటి యూనిట్ అందుబాటులోకి వచ్చినట్లు మంత్రి తెలిపారు. దశాబ్ద కాలంలో మొదటి రెండు యూనిట్లు కార్యకలాపాలను ప్రారంభించటం, స్పష్టమైన అమలు విధానాన్ని, కాలపరి మితులకు కట్టుబడి క్రమశిక్షణతో పనిచేయటాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.

16 కిలోమీటర్ల అత్యవసర ప్రణాళికా పరిధిలో చేపడుతున్న కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. అన్ని అణుశక్తి కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని ప్రజల కోసం సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)గా, పునరావాస, పునరుద్ధరణ (ఆర్ అండ్ ఆర్) కార్యకలాపాలను న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నిర్వహిస్తుందని తెలిపారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రాజెక్టులన్నింటికీ రూ. 168 కోట్లు వెచ్చించగా, సీఎస్ఆర్ ద్వారా గణనీయమైన కేటాయింపులు జరిగినట్లు ఆయన సభకు తెలియజేశారు. గత నాలుగేళ్లలో కూడంకుళం ప్రాజెక్టుకు సంబంధించి కచ్చితమైన గణాంకాలను విడిగా సమర్పిస్తామని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలు మౌలిక సదుపాయాలు, స్థానిక ప్రజలకు ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తాయని తెలిపారు.

జైతాపూర్ అణు విద్యుత్ ప్రాజెక్టులో ప్రతిపాదిత ఆరు 1600 ఎండబ్ల్యూ రియాక్టర్లకు సంబంధించిన చర్చలపై అడిగిన ప్రశ్నకు డాక్టర్ జితేంద్ర సింగ్ సమాధానమిస్తూ.. చర్చలు కొనసాగుతున్నాయని, సాంకేతిక ఒప్పంద ముసాయిదా సిద్ధంగా ఉన్నప్పటికీ, కొన్ని వాణిజ్యపరమైన అంశాలు ఇంకా పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు. జాతీయ ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత మంత్రిత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

యూరేనియం దిగుమతులు, అస్థిరమైన అంతర్జాతీయ పరిస్థితుల వల్ల సరఫరా సమస్యలపై వ్యక్తమైన ఆందోళనలకు డాక్టర్ జితేంద్ర సింగ్ సమాధానమిచ్చారు. గత దశాబ్ద కాలంలో ఇంధన భద్రతను భారత్ గణనీయంగా బలోపేతం చేసుకుందని తెలిపారు.

2014 నుంచి అణుశక్తి సామర్థ్యం రెట్టింపు కంటే అధికమైందని, దేశీయ సామర్థ్యాన్ని వేగవంతం చేసేందుకు ఇటీవల కాలంలో అణు విద్యుత్ ప్లాంట్ పరికరాల దిగుమతులపై 2035 వరకు సుంకం మినహాయింపులు వంటి విధానపరమైన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. భారతదేశం కేవలం బాహ్య వనరులపైనే ఆధారపడటం లేదని, స్వదేశీ సామర్థ్యాన్ని సిద్ధం చేసుకుంటూ పెంపొందించుకుంటున్నట్లు ఈ విస్తరణ ప్రణాళికలు స్పష్టం చేస్తున్నాయన్నారు.

విద్యుత్ కేటాయింపులపై అడిగిన ప్రశ్నలకు మంత్రి స్పందిస్తూ.. అణు విద్యుత్ కేంద్రాల నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్ పంపిణీ గాడ్గిల్ ఫార్ములా ప్రకారం జరుగుతుందని, ఉత్పత్తయిన విద్యుత్తులో 50% వాటాను ఆతిథ్య రాష్ట్రం నిలుపుకుంటుందని, 35% పొరుగు రాష్ట్రాలకు కేటాయిస్తుందని, మిగిలిన 15% కేంద్ర గ్రిడ్‌కు వెళ్తుందని చెప్పారు. ఈ విధానం ప్రాంతాల మధ్య సమాన పంపిణీని సూచిస్తుంది.

కుడంకుళం ప్రాంతంలో భద్రతాపరమైన ఆందోళనలు, గతంలో వెలువడిన అభ్యంతరాలపై మంత్రి సమాధానమిచ్చారు. "భద్రతకే తొలి ప్రాధాన్యత.. తర్వాతే ఉత్పత్తి" అనే సూత్రంపై భారత అణు కార్యక్రమం పనిచేస్తుందని స్పష్టం చేశారు. కుడంకుళంలో వాడేసిన ఇంధనాన్ని ఒకే చోట నిల్వ చేస్తున్నారన్న ఆరోపణలకు శాస్త్రీయ ఆధారాలు లేవని స్పష్టం చేశారు. ప్రతి రియాక్టర్.. దానికి సంబంధించిన ఇంధన ప్రక్రియను స్వయంగా నిర్వహిస్తుందని వివరించారు.

అణువిస్తరణకు ప్రభుత్వం స్పష్టమైన సమయపాలనను నిర్ణయించిందని, వాటిని నిర్మాణాత్మకంగా, క్రమశిక్షణతో అమలు చేస్తున్నట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. భారతదేశ దీర్ఘకాలిక ఇంధన పరివర్తన వ్యూహంలో అణుశక్తి కీలకంగా వ్యవహరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# క్యూలైన్లో ఉన్న భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం..



శ్రీశైలం ఫిబ్రవరి 13: జ్యోతిర్లింగాలలో ఒకటైన ఆరవలింగం నంద్యాల జిల్లాలోని శ్రీశైలంలో వెలిసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న రు. అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లో ఉన్న భక్తులకు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారు.

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు ప్రత్యేక హోదా ఉన్నప్పటికీ సామాన్య భక్తులతో కలిసి క్యూలైన్లో వారితోపాటు 20 నిమిషాలు నడిచి శ్రీశైలం అమ్మవారి దర్శనం చేసుకోవటం విశేషం. ఆరవ రోజు అయిన శుక్రవారం శ్రీశైల మహా పుణ్య క్షేత్రంలో ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఉచిత క్యూ లైన్ ద్వారా సాధారణ భక్తులతో కలిసి వెళ్లి సుమారు 20 నిమిషాల్లో దర్శనం చేసుకున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లు, ఉచిత దర్శన క్యూ లైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, శానిటేషన్, వైద్య సదుపాయాలను భక్తులతో క్యూలైన్లో వెళ్లి పరిశీలించరు.

క్యూ లైన్ లో ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశిస్తూ ఇబ్బందులను భక్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక దర్శనాల కంటే సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇస్తూ, ఉచిత క్యూ లైన్ ద్వారా తక్షణ దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు. భక్తులు శాంతి, నియమ నిబంధనలు పాటిస్తూ దర్శనం చేసుకోవాలని సూచించిన జిల్లా కలెక్టర్. క్యూ లైన్ లో వెళ్లి అమ్మవారి దర్శనంతో పాటు తాగునీరు, లడ్డు ప్రసాదాన్ని కూడా పరిశీలించారు. భక్తులు కూడా తమతో పాటు క్యూ లైన్‌లో వచ్చిన కలెక్టర్ ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపటం విశేషం.

# సీఎంఎం కోర్టుకు దేవినేని ఉమా..

విజయవాడ, ఫిబ్రవరి 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో నమోదైన రెండు వేర్వేరు కేసుల విచారణ నిమిత్తం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు శుక్రవారం విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (సీఎంఎం) కోర్టుకు పార్టీ నాయకులతో కలిసి హాజరయ్యారు. విజయవాడ రూరల్ మండలంలోని జె.ఎన్. ఎన్. యు. ఆర్.ఎం కాలనీలో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా అప్పటి ప్రభుత్వం నమోదు చేసిన కేసుతో పాటు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు అంశంపై నమోదైన కేసులో భాగంగా విచారణకు హాజరయ్యారు.

# ఫించన్ల కోసం ఏటా రూ.34వేల కోట్లు..

అమరావతి, ఫిబ్రవరి 13: పింఛన్ల కోసం ఏటా రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఇంత పెద్దమొత్తంలో పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం మనదేనని సీఎం చంద్రబాబు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ఆయన మాట్లాడుతూ.. చట్టసభ ప్రజా దేవాలయమని, వైసీపీ పాలనలో అసెంబ్లీ బూతులకు నమూనాగా ఉండేదని సీఎం చంద్రబాబు విమర్శించారు. ప్రస్తుతం సభలో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయని, ఇటీవల నిర్వహించిన మాక్ అసెంబ్లీలో విద్యార్థులు సభ్యుల కంటే బాగా మాట్లాడారని ప్రశంసించారు.

ఏపీ అభివృద్ధికి సహాయం అందించిన కేంద్రాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు



సీఎం చంద్రబాబు తెలిపారు. కేంద్రం మద్దతు ఇచ్చి వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కోలుకునేలా చేసిందన్నారు. హామీల అమలుకు కేంద్రం కూడా బాధ్యత తీసుకుందని చెప్పారు.

ఈఏడాదిలో 1000 ఏసీ బస్సులను తీసుకొన్తున్నట్లు వెల్లడించారు.

# ఇంటర్మీడియట్ హాల్ టికెట్లు విడుదల..

## -ఫీజు కట్టలేదు హాల్ టికెట్ ఇవ్వమన్నా అంశమే ఉండకూడదు..
## -ఆన్లైన్లో డౌన్లోడ్ చేసుకోవచ్చు.. పరీక్షకు హాజరు కావచ్చు..

అమరావతి, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో పబ్లిక్ పరీక్షల కాలం మొదలైంది. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు ఇప్పటికే షెడ్యూల్డ్ ప్రకటించారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న యి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ కళాశాలకు చెక్ పెట్టింది. ఫీజు చెల్లిస్తే గాని హాల్ టికెట్లు ఇవ్వం అన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటర్మీడియట్ విద్యార్థులకు నేరుగా మనమిత్ర వాట్సాప్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావచ్చని ఇంటర్మీడియట్ బోర్డు విద్యా మండలి కార్యదర్శి రంజిత్ భాష శుక్రవారం తెలిపారు.

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేశారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్‌బాషా తెలిపారు. విద్యార్థులు https://bie.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా నేరుగా హాల్‌టికెట్లు పొందొచ్చన్నారు.

మొదటి సంవత్సరం వారు పదో తరగతి హాల్ టికెట్ నంబరు, ద్వితీయ సంవత్సరం వారు మొదటి సంవత్సరం హాల్ టికెట్ నంబరు లేదా ఆధార్ నంబరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచిం చారు. మనమిత్ర వాట్సప్ నంబరు 955230 0009కు హాయ్ అని మెసేజ్ పెట్టి, హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. హాల్ టికెట్లపై కళాశాల ప్రిన్సిపల్, కళాశాల స్టాంప్ అవసరం లేదని తెలిపారు.

ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పుస్తకాల్లో సమూల మార్పులు చేశారు. జాతీయ స్థాయి ప్రవేశపరీక్షలకు తగ్గట్టుగా ఇందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి సబ్జెక్టుకు ఒక ప్రత్యేక విభాగాన్ని రూపొందించారు. రూపకల్పన సైన్స్ సబ్జెక్టుల సిల బస్ అంతా స్టేట్ కౌన్సిల్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ సెంటర్ వారిదే బాధ్య తగా పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నూతన ప్రణాళిక మారిన సిలబస్ అమలవుతుందని విద్యా మండలి కార్యదర్శి రంజిత్ భాష శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్ ప్రథమ సం వత్సరం చదువుతున్న విద్యార్థులు, ద్వితీయ సంవత్సర చదువుతున్న విద్యార్థుల పరీక్షల హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ నెల 23వ తేదీ నుండి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

విద్యార్థులు ఈ క్రింది వివరాలను ఉపయోగించి తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.. ఆధార్ నంబర్, పదో తరగతి హాల్ టికెట్ నంబర్ లేదా మొదటి సంవత్సరం హాల్ టికెట్ నంబర్ (రెండవ సంవత్సరం విద్యార్థుల కోసం ఉపయోగించుకుని హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవచ్చు. ?మీరు చిత్రంలో ఉన్న అధికారిక వెబ్‌సైట్ లేదా సంబంధిత లింక్ ద్వారా వీటిని పొందవచ్చు. https://bie.ap.gov.in హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసిన తర్వాత మీ పేరు, ఫోటో, మరియు పరీక్షా కేంద్రం వివరాలను ఒకసారి సరిచూసుకోవాలని కార్యదర్శి రంజిత్ భాష ఆదేశాల్లో పేర్కొన్నారు.

# ప్రాచీన వస్తువుల అక్రమ వ్యాపార నిరోధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: జాతీయ ప్రాధాన్యం కలిగిన కట్టడాల్లో ఆరు చోరీ కేసులు బయటపడ్డాయి. నాలుగు కేసుల్లో దొంగతనానికి గురైన వస్తువులను తిరిగి రాబట్టారు. (వివరాలు ఒకటో అనుబంధ పత్రంలో). అన్ని కేసులలో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. దొంగతనానికి గురైన వస్తువులేవీ దేశం బయటకు తరలిపోలేదు. పైన ప్రస్తావించిన పురాతన వస్తువుల విషయంలో భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ) మూల్య నిర్ధారణ పనిని చేపట్టలేదు.

సాంస్కృతిక సంపద అక్రమ వ్యాపారాన్ని అడ్డుకొనే దిశగా అవసరమైన అన్ని చర్యల్నీ ప్రభుత్వం చేపడుతుంది. పహరా రక్షణ సిబ్బందికి అదనంగా, ప్రయివేటు సెక్యూరిటీ గార్డులతో పాటు కేంద్ర పారిశ్రామిక భద్రత దళ సిబ్బందిని కూడా ఆయా కట్టడాలు, స్థలాలు, మ్యూజియాల్లో అవసరమైన మేరకు విధుల్లో నియమించారు.

ఏ పురావస్తు దొంగతనం జరిగినట్లు తెలిసినా, ఎఫ్ఐఆర్ దాఖలు చేయడంతో పాటు చోరీ చేసిన ప్రాచీన వస్తువు జాడ కనుగొనడానికీ, ఆ వస్తువును దేశం బయటకు దొంగచాటుగా రవాణా చేయకుండా అడ్డగించడానికీ కస్టమ్ ఎగ్జిట్ మార్గాలు కాపు కాయడం సహా నేర నియంత్రణ సంస్థలకు 'లుక్ అవుట్ నోటీసు'ను జారీ చేస్తారు. మన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించే దిశగా ప్రజల్లో జాగృతిని పెంచే ప్రయత్నాల్ని నిరంతరంగా చేపడుతున్నారు.

# జమ్మూకాశ్మీర్‌లోని స్మారక కట్టడాల పరిరక్షణ, భద్రత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: జమ్మూకాశ్మీర్‌లో భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) పర్యవేక్షణ, నిర్వహణలో 56 కేంద్ర రక్షిత స్మారక కట్టడాలున్నాయి. ఈ కట్టడాలను సంరక్షించటానికి, కాపాడటానికి, భద్రత కల్పించటానికి ఏఎస్ఐ నిరంతరం చర్యలు చేపడుతుంది.

అవసరానికి అనుగుణంగా, వనరుల లభ్యతను బట్టి వివిధ స్మారక కట్టడాల వద్ద మరమ్మతులు, పునరుద్ధరణ, నిర్మాణ పటిష్ఠతను పెంచే పనులను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. నారానాగ్ ఆలయ సముదాయం, మార్తాండ్ సూర్య దేవాలయం, బనియార్‌లోని పురాతన ఆలయంతో సహా ఎంపిక చేసిన కొన్ని కట్టడాల సమగ్ర సమాచార సేకరణ, భవిష్యత్తు పరిరక్షణ ప్రణాళిక కోసం లైడార్ మ్యాపింగ్, జీఐఎస్, డ్రోన్ ఆధారిత సర్వేల వంటి ఆధునిక డాక్యుమెంటేషన్ సాధనాలను ఉపయోగించాలన్న ప్రతిపాదనలున్నాయి.

జమ్మూకాశ్మీర్‌లోని ఎంపిక చేసిన వారసత్వ సంపద ప్రాంతాల్లో సమగ్ర, దశలవారీ అభివృద్ధి పనులను చేపట్టాలన్న ఏఎస్ఐ ప్రతిపాదనల్లో భాగంగా.. పరిరక్షణ, సందర్శకులకు సౌకర్యాల కల్పన, వారసత్వ సంపదపై అవగాహన కల్పించటం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తారు.

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు పరిరక్షణ, అభివృద్ధి పనులు పూర్తి చేయాలని నిర్ణయించిన స్మారక కట్టడాల జాబితాను అనుబంధం-ఎలో జతపరిచారు. అలాగే 2025-26 సంవత్సరానికి సంబంధించిన నిధుల కేటాయింపు, ఖర్చుల వివరాలను ఇచ్చారు.

# విద్యార్థులు ఇష్టపడి చదవాలి : మాధవరెడ్డి




నల్గొండ, ఫిబ్రవరి 13: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని వందేమాతరం ఫౌండేషన్ సెక్రటరీ ఏడమ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం కట్టంగూర్ ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ డైమండ్, లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ సంయుక్తంగా నిర్వహించిన యువ వికాసంలో భాగంగా వ్యక్తిత్వ వికాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం చదువుపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు మెలుకువలు, సలహాలు, సూచనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కట్టంగూర్ సర్పంచ్ ముక్కాముల శ్యామల శేఖర్, ఎంఈఓ అంబటి అంజయ్య, ఏదుల్ల అంజిరెడ్డి, అలుగుబెల్లి కురుణాకర్ రెడ్డి, బండ పురుషోత్తంరెడ్డి, సముద్రాల అశోక్, నన్నూరి నాగిరెడ్డి, అలుగుబెల్లి శ్రీనివాస్ రెడ్డి, లయన్స్ క్లబ్ కట్టంగూర్ కింగ్స్ అధ్యక్షులు చిక్కు శేఖర్, ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి పోగుల రాములు, సభ్యులు బొడ్డుపల్లి వెంకన్న, గోలిక ఉమాపతి, ఉపాధ్యాయులు చిన్ని శ్రీనివాస్, జయమ్మ, రాణి, అబ్దుల్ గఫూర్ పాల్గొన్నారు.

# విద్యాంజలి కార్యక్రమంలో చేరిన 8.5 లక్షల పాఠశాలలు, 5 లక్షల మంది వాలంటీర్లు: రాజ్యసభలో శ్రీ జయంత్ చౌధరి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: విద్యాంజలి కార్యక్రమం అమలుకు సంబంధించిన ప్రశ్నకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక రంగం సహాయ మంత్రి (స్వతంత్ర), విద్యా శాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌధరి రాజ్యసభలో ఈరోజు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సాధించిన ప్రగతిని ఆయన సభకు తెలియజేశారు. సామాజిక, ప్రైవేటు రంగ భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వడం, అభ్యాసన ఫలితాలను మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం.

జాతీయ విద్యావిధానం 2020కి అనుగుణంగా సెప్టెంబర్ 2021లో విద్యాంజలి కార్యక్రమం ప్రారంభమైంది. నిర్మాణాత్మకమైన సామాజిక భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలను ఈ కార్యక్రమం బలోపేతం చేస్తుంది. ఈ వేదిక వాలంటీర్లు, పూర్వ విద్యార్థులు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సీఎస్ఆర్ భాగస్వాములను నేరుగా బడులతో అనుసంధానిస్తుంది. పాఠశాలల్లో గుర్తించిన అవసరాల ఆధారంగా ఈ ప్రక్రియ జరుగుతుంది.

2021 సెప్టెంబర్‌లో ప్రారంభమైన నాటి నుంచి విద్యాంజలి కార్యక్రమంలో దేశవ్యాప్తంగా సుమారుగా 8.5 లక్షల పాఠశాలలు, దాదాపు 5 లక్షల మంది వాలంటీర్లు చేరారని మంత్రి సభకు తెలియజేశారు. ఈ వేదిక సేవలు, కార్యకలాపాలు, విరాళాల రూపంలో సహకారాన్ని అందిస్తుంది. వాటిలో పాఠ్యాంశాల బోధన, కెరీర్ కౌన్సెలింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్ లాంటి నూతన రంగాలపై వర్క్‌షాపులు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు తోడ్పాటు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయి. వీటితో పాటుగా అలాగే బోధనా సామగ్రి, ఐసిటి సౌకర్యాలు, ప్రయోగశాలలు, పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధన పరిష్కారాలను అందించడం కూడా ఉన్నాయి.

దేశవ్యాప్తంగా 2 కోట్ల మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం అందిస్తూ ఇప్పటి వరకు 56,734కు పైగా సేవా కార్యకలాపాలు, 35,695 వస్తు విరాళాలు అందాయి. సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అనుగుణంగా పాఠశాల వాతావరణాన్ని మెరుగుపర చడానికి, బడుల్లో వనరులను బలోపేతం చేయడానికి విద్యాంజలి కార్యక్రమం సహకరించిందని మంత్రి చెప్పారు.

అనుమతులు, పర్యవేక్షణ, ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను పర్యవేక్షించే నిర్మాణాత్మక డిజిటల్ విధానం ద్వారా ఈ కార్యక్రమం పనిచేస్తుందని ఆయన తెలియజేశారు. డాష్‌బోర్డ్‌ల ద్వారా రాష్ట్రాలు పురోగతిని సమీక్షిస్తాయి. పాఠశాలలు స్వచ్ఛంద సేవల వివరాలను ధ్రువీకరిస్తాయి. ఇది పారదర్శకతను, జవాబు దారీతనాన్ని పెంపొందిస్తుంది.

పాఠశాల విద్యలో ప్రజల భాగస్వామ్య స్ఫూర్తిని విద్యాంజలి ప్రతిబింబిస్తుంది. అలాగే ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు తోడ్పాటు అందించేలా భాగస్వాములను ప్రోత్సహిస్తుంది.

# భారత్ మండపంలో 'భారత్ బోధన్ ఏఐ సదస్సు-2026' ప్రారంభం: దేశవ్యాప్త 'ఎడ్యుఏఐ' సహకారానికి వేదిక సిద్ధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇవాళ 'భారత్ బోధన్ ఏఐ సదస్సు-2026'ను ఉద్దేశించి కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ప్రసంగించారు. ఆ శాఖ సహాయ మంత్రి శ్రీ సుకాంత మజుందార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా 'బోధన్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను శ్రీ ప్రధాన్ ప్రారంభించారు. భారత విద్యా వ్యవస్థ అంతటా కృత్రిమ మేధ (ఏఐ) ఏకీకరణను విస్తరించడంలో ఈ సదస్సు కీలక మలుపు కానుంది. పాఠశాల విద్య-అక్షరాస్యత విభాగం కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్; ఉన్నత విద్య కార్యదర్శి డాక్టర్ వినీత్ జోషి; ఎలక్ట్రానిక్స్-ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఎస్.కృష్ణన్; ఐఐటీ-మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి; విద్యా రంగంలో 'ఏఐ'ని ఉపయోగిస్తున్న ప్రముఖ అగ్రగామి అంకుర సంస్థల ప్రతినిధులు, పరిశోధకులు, వ్యవస్థాపకులు దీనికి హాజరయ్యారు. 'ఏఐ' ఆధారిత విద్యకు రంగం సిద్ధం చేయడం, వ్యూహాత్మక సంధానం, భాగస్వామ్యాల ఏర్పాటు తదితరాలకు జాతీయ వేదికగా ఈ సదస్సుకు రూపకల్పన చేశారు.

విద్యా రంగంలో 4 ప్రాధాన్య శ్రేణులు- పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యం-కార్మికశక్తి సంసిద్ధత, పరిశోధన-విస్తృత సాంకేతికతల సంబంధిత పరిష్కారాలను ఈ సదస్సు అన్వేషిస్తుంది.

ఈ సందర్భంగా శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ- రెండు రోజులపాటు సాగే ఈ సమావేశంలో విద్యారంగం, పరిశ్రమలు, విధాన నిర్ణేతలు, అంకుర సంస్థలు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, నైపుణ్యావరణ వ్యవస్థ తదితరాలను ఒకే వేదికపైకి తెస్తుందన్నారు. దీనిపై మేధోమథనం ద్వారా విద్యలో 'ఏఐ'ని ఏకీకృతం చేస్తూ 'భారత్ ఎడ్యుఏఐ స్టాక్'ను రూపొందిస్తుందని చెప్పారు. భారత్‌ను ఏఐ సంసిద్ధం చేయాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ విస్పష్టంగా పిలుపునిచ్చారని పేర్కొన్నారు. ఆ మేరకు నైతిక, బాధ్యతాయుత, సమగ్ర 'ఏఐ' రూపకల్పన-అమలు అవసరాన్ని ఆయన స్పష్టం చేశారని తెలిపారు.

రూపకల్పన రీత్యా భారత్ ఏఐ సార్వజనీనంగా ఉంటుందని, స్వరూపం రీత్యా పరస్పర సమన్వయంతో పనిచేయగలదని, సామర్థ్యం రీత్యా స్వతంత్రంగా ఉంటుందని శ్రీ ప్రధాన్ వివరించారు. విద్యార్థులకు సాధికారత, బోధకులకు మద్దతు లక్ష్యంగా విద్యారంగంలో 'ఏఐ' ఏకీకరణ ప్రాధాన్యాన్ని ఆయన స్పష్టం చేశారు. విద్యను పరిణామశీలం చేయడానికి, వికసిత భారత్ లక్ష్య సాధనకు అనుసరణీయ, బాధ్యతా యుత, నైతిక, భారత-కేంద్రక స్వతంత్ర 'ఏఐ' నమూనాలను రూపొందించాలని భాగస్వాములందరికీ పిలుపునిచ్చారు. సమష్టి మేధతో భారత ఏఐ సామర్థ్యం పెంపు, 'ఏఐ'లో భారత అగ్రస్థానం బలోపేతం, విద్యలో సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాల రూపకల్పన, అందరికీ 'ఏఐ' సౌలభ్యం దిశగా ఈ సదస్సు మార్గం సుగమం చేయగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ సుకాంత మజుందార్ ప్రసంగిస్తూ- భారత దేశం 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' దిశగా పయనిస్తున్నందున "సురక్షిత, జవాబుదారీ, నిష్పాక్షిక, సాధికార (సెక్యూర్, అకౌంటబుల్, ఫెయిర్, ఎంపవరింగ్ ఏఐ- ఎస్.ఎ.ఎఫ్.ఇ.ఎ) 'ఏఐ'కి కట్టుబడి ఉందామని పిలుపునిచ్చారు. తద్వారా సమ్మిళిత పురోగమనం దిశగా భారత్ సాంకేతికతకు రూపమిస్తుంది.

ఈ సదస్సులో భాగంగా పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యంలో ఏఐ-ఆధారిత ఆవిష్కరణలను చాటే ప్రదర్శనను కూడా ప్రారంభించారు. విధాన రూపకర్తలు, ఆవిష్కర్తల మధ్య పరస్పర చర్చలకు ఇదొక వేదికను సమకూరుస్తుంది.

ఈ సదస్సులో 'బోధన్.ఏఐ' సహా ఐఐటీ-మద్రాస్‌లో 'ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎడ్యుకేషన్' ఏర్పాటుపై ప్రత్యేక గోష్ఠి నిర్వహించారు. ఓపెన్ భారత్ ఎడ్యుఏఐ స్టాక్ రూపల్పన ఆవశ్యకత సహా ఈ కార్యక్రమంపై సమగ్ర ప్రదర్శన నిర్వహించారు. 'సర్వం ఏఐ' సీఈవో శ్రీ ప్రత్యూష్ కుమార్ కూడా ఈ కార్యక్రమంలో ప్రసంగించగా, గోష్ఠిలో భాగంగా విద్య లో ఏఐ భవిష్యత్తుపైనా చర్చించారు.

దీనికి 'ఇన్‌ఫ్లెక్షన్ ఏఐ' సీటీవో విభు మిట్టల్ సమన్వయకర్తగా వ్యవహరించారు. రాకెట్ లెర్నింగ్ పాలసీ లీడ్ రాధిక మాథుర్; సీకే-12 ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరు ఖోస్లా; ఖాన్ అకాడమీ కంట్రీ డైరెక్టర్ స్వాతి వాసుదేవన్; వేదాంతు సహ వ్యవస్థాపకుడు పుల్కిత్ జైన్; ఐడ్రీమ్ ఎడ్యుకేషన్ సహ వ్యవస్థాప కుడు పునీత్ గోయల్; లీడ్ గ్రూప్ సీఈవో సుమిత్ మెహతా; అరివిహాన్ సీఈవో రితేష్ సింగ్ చందేల్; లెర్నింగ్ మ్యాటర్స్ సహ వ్యవస్థా పకుడు-సీఈవో జి.రామమూర్తి; ఎకోవేషన్ వ్యవస్థాపకుడు-సీఈవో రితేష్ సింగ్ ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు.

ఈ గోష్ఠికి 'వాధ్వానీ సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' సీఈవో ప్రకాష్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఎక్‌స్టెప్ ఫౌండేషన్ సీఓఓ జగదీష్ బాబు; ఐఐటీ-బాంబే (టీఏఆర్ఏ) ప్రొఫెసర్ డాక్టర్ ప్రీతి రావు; లాంగ్వేజ్ అండ్ లెర్నింగ్ ఫౌండేషన్ సీనియర్ డైరెక్టర్ ఉద్దాలక్ దత్తా; సంపర్క్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు-ఛైర్మన్ వినీత్ నాయర్; మాధి ఫౌండేషన్ సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్ గోకుల్ కుమార్; టీసీఎస్ ఫౌండేషన్ గ్లోబల్ హెడ్-ఎడ్యుకేషన్ అండ్ స్కిల్లింగ్ విపుల్ షా; విద్యాశక్తి ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజన్ పిచుమణి తదితరులు కీలక వక్తలుగా పాల్గొన్నారు.

తరగతి గదిలో అభ్యాసం, ఉపాధ్యాయ మద్దతు వ్యవస్థలు సహా ప్రాథమిక అభ్యసన కార్యక్రమాలు, పాలన చట్రాల మెరుగుదల లక్ష్యంగా అనుసరణీయ ఏఐ ఆధారిత పరిష్కారాల ప్రదర్శనలో భాగం గా ప్రముఖ సంస్థలు, అంకుర సంస్థలను ఈ సదస్సు ఒక వేదికపైకి తెచ్చింది.

సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఏఐ వేదికలు, ఆధునిక సాంకేతికతలు, నైపుణ్యాలు, ఉన్నత విద్య వగైరాలపై దృష్టి సారిస్తూ ఈ నెల 13 వరకూ సదస్సు కొనసాగుతుంది.

# భారత్‌లో క్షయవ్యాధికి తక్కువ కాలం వాడే మాత్రలతో మెరుగైన ఫలితాలు: ఐసీఎంఆర్ అధ్యయనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో ప్రచురితమైన ఆర్థిక మూల్యాంకనం ప్రకారం... మల్టీడ్రగ్-రెసిస్టెంట్, రిఫాంపిసిన్-రెసిస్టెంట్ క్షయవ్యాధి (ఎండీఆర్/ఆర్ఆర్-టీబీ) కోసం ఆరు నెలల స్వల్పకాలిక నోటి ద్వారా తీసుకునే చికిత్సా విధానాలు తక్కువ ఖర్చుతో కూడుకున్నవి. ప్రస్తుతం దేశంలో వాడుతున్న సుదీర్ఘ చికిత్స పద్ధతులతో పోలిస్తే మెరుగైన ఆరోగ్య ఫలితాలను ఇస్తాయని నిరూపితమైంది.

ఈ అధ్యయనాన్ని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ట్యూబర్‌క్యులోసిస్ (ఐసీఎంఆర్-ఎన్ఐఆర్ టీ) నిర్వహించింది. ఇది బెడాక్విలిన్ ఆధారిత చికిత్స పద్ధతులైన బీపీఏఎల్ (బెడాక్విలిన్, ప్రెటోమానిడ్, లైనెజోలిడ్), బీపీఏఎల్ఎం (మోక్సిఫ్లోక్సాసిన్)లను.. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద ప్రస్తుతం అమలులో ఉన్న బెడాక్విలిన్ కలిగిన 9?11 నెలల స్వల్పకాలిక, 18?20 నెలల దీర్ఘకాలిక చికిత్స పద్ధతులతో పోల్చి వాటి ఖర్చు ప్రభావాన్ని అంచనా వేసింది.

ఈ విశ్లేషణ ప్రకారం బీపీఏఎల్ చికిత్స పద్ధతి అత్యంత ప్రభావవంతమైనదే మాత్రమే కాకుండా ఖర్చును కూడా ఆదా చేస్తుందని తేలింది. సాధారణ చికిత్సతో పోలిస్తే బీపీఏఎల్ ద్వారా పొందే ప్రతి క్వాలిటీ అడ్జస్టెడ్ లైఫ్ ఇయర్ (ఆరోగ్యవంతమైన జీవిత కాలం- క్యూఏఎల్ వై) పొందడానికి ఆరోగ్య వ్యవస్థ ఒక్కో రోగిపై అదనంగా రూ.379 తక్కువ ఖర్చు చేస్తుంది. అంటే తక్కువ ఖర్చుతోనే మెరుగైన ఆరోగ్య ఫలితాలు లభస్తున్నాయని దీని అర్థం. బీపీఏఎల్ఎం చికిత్సా విధానం కూడా చాలా పొదుపైనదిగా గుర్తించారు. సాధారణ పద్ధతితో పోలిస్తే దీని ద్వారా పొందే ప్రతి క్వాలిటీ అడ్జస్టెడ్ లైఫ్ ఇయర్ కోసం ఒక్కో రోగిపై కేవలం రూ. 37 మాత్రమే అదనపు ఖర్చు అవుతుంది. మొత్తంగా చూస్తే ఈ రెండు రకాల చికిత్సల్లోనూ మందులు, ఆసుపత్రి సందర్శనలు, తదుపరి పర్యవేక్షణ వంటి అన్ని ఖర్చులు కలిపినా... అవి ప్రస్తుతమున్న పద్ధతుల కంటే తక్కువగా లేదా సమానంగా ఉన్నట్లు అధ్యయనం తెలిపిది.

దీర్ఘకాలిక చికిత్స, దుష్ప్రభావాలు, అధిక ఖర్చుల కారణంగా ఎండీఆర్/ఆర్ఆర్-టీబీ చికిత్స ప్రస్తుతం సవాలుగా మారింది. అయితే ఆరు నెలల స్వల్పకాలిక నోటి మాత్రల చికిత్స ద్వారా రోగులు క్రమం తప్పకుండా మందులు వాడే అవకాశం పెరుగుతుంది. అనారోగ్య బాధలు తగ్గడమే కాకుండా వారు త్వరగా సాధారణ జీవితంలోకి తిరిగి రావచ్చు. ఇది ఆరోగ్య వ్యవస్థపై ఉన్న భారాన్ని కూడా తగ్గిస్తుంది. దేశంలో ఎండీఆర్/ఆర్ఆర్-టీబీ నివారణ కు ఈ స్వల్పకాలిక చికిత్సలు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ అధ్యయనం ఆర్థికపరమైన ఆధారాలను అందించింది. చికిత్స కాలాన్ని 9-18 నెలల నుంచి ఆరు నెలలకు తగ్గించడం ద్వారా వనరులను సమర్థవం తంగా వాడుకోవాలనే జాతీయ లక్ష్యాలకు ఇది ఊతాన్నిస్తుంది.

టీబీకి వ్యతిరేకంగా దేశ పోరాటాన్ని బలోపేతం చేసేందుకు, బీపీఏఎల్ ఆధారిత చికిత్సలు తక్కువ ఖర్చుతో కూడుకున్నవి, అత్యంత ప్రభావవంతమైనవిగా ఈ అధ్యయనం తేల్చింది.

# విమానాల కోసం హెచ్ఏఎల్‌తో రక్షణ శాఖ ఒప్పందం కాంట్రాక్టు విలువ... రూ.2,312 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: డార్నియర్ 228 రకం విమానాలు ఎనిమిదింటిని కొనుగోలు చేయడానికి కాన్పూర్‌లోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ (హెచ్ఏఎల్) ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ డివిజన్‌తో రక్షణ మంత్రిత్వ శాఖ (ఎంఓడీ) ఓ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 'బై (ఇండియన్) కేటగిరీ' ఒప్పందంలో భాగంగా దీంతో పాటు, భారతీయ కోస్తాతీర రక్షక దళం (ఐసీజీ) కోసం ఆపరేషనల్ రోల్ ఎక్విప్‌మెంట్‌ను కూడా రూ.2,312 కోట్లు ఖర్చుతో ఎంఓడీ సమకూర్చుకోనుంది. రక్షణ శాఖ కార్యదర్శి శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో న్యూఢిల్లీలో ఒప్పంద పత్రంపై ఈ రోజు సంతకాలయ్యాయి.

దీంతో హెచ్ఏఎల్ ఉత్పత్తి అనుబంధ విస్తారిత వ్యవస్థ దృఢతరమై, చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కలుగుతాయనీ, సూక్ష్మ- చిన్న-మధ్యతరహా సంస్థలకూ, అనుబంధ పరిశ్రమలకూ పెద్ద ఎత్తున ఊతం లభిస్తుందనీ భావిస్తున్నారు. ఈ ఒప్పందం నిర్వహణ, మరమ్మతులు, పూర్తి స్థాయి తనిఖీ (ఎంఆర్ఓ)కీ, జీవిత కాలం పాటు సాంకేతిక సేవల దిశగా అనేక అవకాశాలను కూడా అందిస్తుంది.

'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా' (భారత్‌లో తయారీ) కార్యక్రమాల విషయంలో ప్రభుత్వ నిబద్ధతను ఈ ఒప్పందం పటిష్ఠపరచడంతో పాటు, భారత నౌకా వాణిజ్య భద్రతా వ్యవస్థకు దన్నుగా నిలుస్తుంది.

# మోరన్ సమీపంలోని జాతీయ రహదారి వద్ద ప్రారంభం కానున్న ఈఎల్ఎఫ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: అస్సాంలోని దిబ్రూగర్ జిల్లాలోని మోరన్ బైపాస్ ఒక చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. ఇక్కడ 2026, ఫిబ్రవరి 14న అత్యవసర ల్యాండింగ్ సౌకర్యం (ఈఎల్ఎఫ్) ప్రారంభం కానుంది. ఈశాన్య ప్రాంతంలో ఇదే మొదటి ఈఎల్ఎఫ్. దీనిని ప్రధానమంత్రి ప్రారంభించి, జాతికి అంకితం చేస్తారు. తద్వారా జాతీయ రహదారిపై గుర్తించిన నిర్దేశిత ప్రాంతం, అత్యవసర సమయాల్లో ప్రత్యామ్నాయ రన్‌వేగా అందుబాటులోకి వస్తుంది. దీనికి యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లు అత్యవసర ల్యాండింగ్, టేకాఫ్ చేయగల సామర్థ్యం ఉంది. మారుమూల ప్రాంతాల్లో మానవతా సాయం, విపత్తు ఉపశమనం (హెచ్ఏ డీఆర్) కార్యకలాపాలు చేపట్టే సమయంలో కీలకంగా మారనుంది.

జాతీయ భద్రతకు సంబంధించి అత్యంత ప్రాధాన్యమున్న ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి, అస్సాం గవర్నర్, ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు, సైనిక ప్రతినిధులు పాల్గొంటారు.

# అధిక డోసులో ఐరన్ ట్యాబ్లెట్లు.. 19 మంది స్కూల్ విద్యార్థులకు అస్వస్థత

చంద్రాపూర్, ఫిబ్రవరి 13: మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలోని ఓ జిల్లా పరిషత్ స్కూల్‌లో 19 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అధిక డోసులో ఐరన్ ట్యాబ్లెట్లు తీసుకోవడం వల్ల విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. ఆ విద్యార్థులను ఆస్పత్రిలో చేర్పించారు. భద్రతావతి తహిసిల్‌లోని భండేలి గ్రామంలో ఈ ఘటన జరిగింది. విద్యార్థుల అస్వస్థతపై దర్యాప్తు చేపట్టారు.

ప్రతి సోమవారం స్కూల్ విద్యార్థులకు ఐరన్ ట్యాబ్లెట్లు ఇస్తుంటారు. అయితే మంగళవారం రోజున కూడా కొందరు స్కూల్ స్టూడెంట్స్ మరిన్ని ఐరన్ ట్యాబ్లెట్లు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. టీచర్లు లేని సమయంలో స్టూడెంట్స్ ఆ ట్యాబ్లెట్లు తీసుకున్నారు. డోసు ఎక్కువ కావడంతో బుధవారం రాత్రి ఆ విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు.అంబులెన్సులను రప్పించిన స్కూల్ యాజమాన్యం.. విద్యార్థు లను చంద్రాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల ప్రకారం 16 మంది విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నది. మరో ముగ్గు రు అబ్జర్వేషన్‌లో ఉన్నారు. ఈ ఘటన పట్ల ఉన్నత స్థాయి విచా రణకు జిల్లా పరిషత్ సీఈవో ఆదేశించారు

# ఏనుగుల దాడి.. ఒక కుటుంబంలోని నలుగురితో సహా ఆరుగురి మృతి



రాంచీ, ఫిబ్రవరి 13: ఏనుగుల మంద గ్రామాల్లో సంచరిస్తున్నది. గత కొన్ని రోజులుగా ఆ ఏనుగులు దాడులు చేస్తూ అలజడి సృష్టిస్తున్నాయి. తాజాగా ఒక కుటుంబంలోని నలుగురితో సహా ఆరుగురు వ్యక్తులను తొక్కి చంపాయి. దీంతో ఆయా గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక ఏనుగుల మంద గ్రామాల్లో సంచరిస్తున్నది. ఏనుగులు పలువురిపై దాడి చేస్తున్నాయి.

కాగా, గురువారం రాత్రి చుర్చు బ్లాక్‌లోని గోండ్వార్ గ్రామంలోకి ఆ ఏనుగులు ప్రవేశించాయి.శుక్రవారం తెల్లవారుజామున ఒక పూరింటిపై దాడి చేశాయి. ఆ ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యుల్లో నలుగురితోపాటు మరో ఇద్దరిని తొక్కి చంపాయి. గాయపడిన చిన్నారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఆ గ్రామానికి చేరుకున్నారు.

ఏనుగుల మంద గత కొన్ని రోజులుగా బొకారో, రామ్‌గఢ్, హజారీబాగ్ జిల్లాల్లో తిరుగుతున్నదని హజారీబాగ్ తూర్పు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) వికాస్ కుమార్ ఉజ్వాల్ తెలిపారు. దీనికి ముందు బొకారో జిల్లాలో కూడా ప్రాణ నష్టం కలిగించాయని చెప్పారు. ఏనుగుల మందను అడవిలోకి పంపేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

# కేడీసీలో ప్రపంచ హీమోగ్లోబిన్ అవగాహన దినోత్సవం



హన్మకొండ, ఫిబ్రవరి 13: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ స్వయం ప్రతిపత్తి(కేడీసీ) బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ హీమోగ్లోబిన్ అవగాహన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవ శరీరంలో ఆక్సిజన్ సరఫరాకు హీమోగ్లోబిన్ ఎంత కీలకమో వివరిస్తూ, రక్తహీనతను నివారించడం ద్వారానే చురుకైన విద్యార్థి దశ సాధ్యమని పేర్కొన్నారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఐరన్ (ఇనుము) లోపాన్ని అధిగమించేందుకు తీసుకోవాల్సిన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు.

ముదురు ఆకుపచ్చ కూరగాయలు, ఎండు ఖర్జూరం, బీట్‌రూట్ వంటి పోషక విలువలున్న ఆహారం ద్వారా రక్తాన్ని వృద్ధి చేసుకోవచ్చని సూచించారు. అనంతరం రఘు మాట్లాడుతూ హీమోగ్లోబిన్ స్థాయిలు తగ్గడం వలన కలిగే తీవ్రమైన అలసట, ఏకాగ్రత లోపించడం వంటి దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రజనీలత, కోమల్, సమ్మయ్య, దినేష్, సమత, శ్యామ్, యుగేందర్, మహేందర్, సీతారాములు పాల్గొన్నారు.

# మహిళల అకౌంట్లలోకి 5 వేలు బదిలీ..సీఎం స్టాలిన్ కీలక ప్రకటన




చెన్నై, ఫిబ్రవరి 13: అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. తమిళనాడు ప్రభుత్వం మహిళలకు భారీ నజరానా అందజేసింది. రాష్ట్రంలోని సుమారు 1.31 కోట్ల మంది మహిళలకు ఇవాళ 5 వేలు బదిలీ చేసినట్లు సీఎం ఎంకే స్టాలిన్ తెలిపారు. కలైగనార్ మగలిర్ ఉరిమై తొగై స్కీమ్ కింద నగదును ట్రాన్స్‌ఫర్ చేశారు. ఒక్క రోజే రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 6550 కోట్లు పంపిణీ చేసింది. సీఎం స్టాలిన్ మరో ప్రకటన కూడా చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే, సహాయ నగదును రెండు వేలకు పెంచనున్నట్లు చెప్పారు. కేఎంయూటీ స్కీమ్ కింద గత మూడు నెలలకు చెందిన మూడు వేలతో పాటు వన్‌టైం సమ్మర్ రిలీఫ్ కింద అదనంగా మరో రెండు వేలు కలిపి మహిళల అకౌంట్లలో డిపాజిట్ చేశారు.

లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలోకి నేరుగా ఆ అమౌంట్‌ను బదిలీ చేశారు. ఈ స్కీమ్‌ను అడ్డుకునేందుకు విపక్షాలు ప్రయత్నించినట్లు ఆయన ఆరోపించారు. ఎన్నికల నియమావళి సాకుతో నిధులను అడ్డుకునేందుకు ప్రయత్నించారన్నారు. డీఎంకే సర్కారు కేఎంయూటీ స్కీమ్ కింద ప్రతి నెల అర్హులైన మహిళలకు వెయ్యి రూపాయిలు తమ అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్ చేయనున్నది. ఒకవేళ తాము కూడా అధికారంలోకి వస్తే మహిళలకు ప్రతినెల రెండు వేలు ఇవ్వనున్నట్లు అన్నాడీఎంకే నేత పళనిస్వామి ప్రామిస్ చేసిన విషయం తెలిసిందే.

# మృతుడి కుటుంబానికి దొంగతుర్తి గ్రామస్తుల ఆర్థిక చేయూత

కరీంనగర్, జఫిబ్రవరి 13: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన దారం గుల సురేష్ కుటుంబానికి గ్రామస్తులు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య శారదతో పాటు కూతురు దివ్య (7) , కుమారుడు లోకేష్ ( 9) సంతానం ఉన్నారు. మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఆ కుటుంబానికి మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం చేసి అండగా నిలవాలని స్థానికులు నిర్ణయి ంచా రు. దీంతో గ్రామస్థులు, మిత్రు లు, తదితరులు కలిసి రూ. 50 వేల విరాళాలు పోగు చేశా రు. ఈ నేపథ్యంలో ఆ సొమ్మును శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. సహాయం అందించిన గ్రామస్తులకు మృతుడు సురేష్ కృత జ్ఞతలు తెలిపారు.

# అనాజీపురం మోడల్ స్కూల్‌లో ఘనంగా ఫేర్‌వెల్ డే




నల్గొండ, ఫిబ్రవరి 13: పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనాజీపురం మోడల్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థుల వీడ్కోలు వేడుకలు వైభవంగా జరిగాయి. పాఠశాల యాజమాన్యం, ఇతర విద్యార్థులు 12వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోడి లింగయ్య ప్రసంగిస్తూ విద్యార్థులు పాఠశాలలో చదువుకున్న సమయంలో వారు సాధించిన విజయాలు, ఎదుగుదలపై గర్విస్తూ వారి భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు. వీడ్కోలు సందర్భంగా 11వ తరగతి విద్యార్థుల కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా 2025- 26 విద్యా సంవత్సరంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులు, సర్టిఫికేట్లు అందజేశారు.

# పీసీసీని కలిసిన కాంగ్రెస్ విజేతలు



భీంగల్ ఫిబ్రవరి 13: భీంగల్ మున్సిపల్ రెండో విడుత సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కలిశారు. బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునిల్ కుమార్, రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేష్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ ల ఆధ్వర్యంలో పీసీసీని నూతన కౌన్సిలర్ సభ్యులు కలిశారు.

విజయం సాధించిన కౌన్సిలర్ లకు పీసీసీ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ని నమ్మి విజయం అందించిన భీంగల్ పట్టణ ప్రజలకు పీసీసీ ధన్యవాదములు తెలిపారు. పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఈ సందర్భంగా పీసీసీ పేర్కొన్నారు. నూతన కౌన్సిలర్లు సంటి లత, ఆరెపల్లి శ్రీజ, పర్శ కుశలత, తోట సతీష్, బోదిరే నాగమణి, అంజుమ్ అలీ, సందీప్, సంగ్యా నాయక్ లతో పాటు పార్టీ మండల అధ్యక్షులు బోదిరే స్వామి, పట్టణ అధ్యక్షుడు నర్సయ్య తదితరులు ఉన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం..

జైనూర్ ఫిబ్రవరి, 13: ఉట్నూర్ నుండి జైనూర్ వరకు లైన్ వర్క్ మరమత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ డి.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ 33/ ఎల రిపేర్ పనులు ఉన్నాయని ఆయన వెల్లడించారు.

శనివారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు సిర్పూర్ యూ, లింగాపూర్, జైనూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది శ్రీనివాస్ పేర్కొన్నారు. కాబట్టి గ్రామీణ విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని ఆయన కోరారు.

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రాంసాగర్ విద్యార్థిని.. అభినందించిన టీచర్లు..!!

సిద్దిపేట ఫిబ్రవరి 13: సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ వాలీబాల్ పోటీల్లో రాయపోల్ మండలం రాంసాగర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ చాటింది. ఫిబ్రవరి 12న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మండల జట్టు తరపున ఆడిన సీహెచ్ అపూర్వ అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన అపూర్వను పాఠశాల ధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు అనీఫ్ అభినందించారు. ఫిబ్రవరి 21 నుంచి 23 వరకు గచ్చిబౌలిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో ఆమె పాల్గొననుందని వారు తెలిపారు.

# 'సుజలం భారత్'లో మాస్టర్ ట్రయినర్స్‌కు శిక్షణను నిర్వహించిన డీడీడబ్ల్యూఎస్..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: దేశంలో 81 శాతానికన్నా ఎక్కువ గ్రామీణ ప్రాంతాల కుటుంబాలకు జల్ జీవన్ మిషన్ (జేజేఎమ్) సేవలను ప్రస్తుతం అందిస్తున్నారు. దీంతో, ఈ మిషన్ క్రమంగా తన దృష్టిని మౌలిక సదుపాయాల కల్పన దశ నుంచి ఇక గ్రామీణ ప్రాంతాలకు నీటిని గొట్టపు మార్గం ద్వారా సరఫరా చేసే వ్యవస్థలను ప్రమాణాల మేరకు నిర్వహించడం, మరమ్మతు, పర్యవేక్షణల వైపునకు మళ్లిస్తోంది. ఈ దిశగా, జల శక్తి శాఖలోని తాగు నీరు, పారిశుధ్య విభాగం (డీడీడబ్ల్యూఎస్) సుజలం భారత్ డేటాబేస్, మొబైల్ అప్లికేషన్ వేదికపై మాస్టర్ ట్రయినర్లకు జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని న్యూఢిల్లీలోని ఎన్‌సీఓపీఈ భవన సముదాయంలో 2026 ఫిబ్రవరి 12న చేపట్టింది. దీంతో పాటు జిల్లా సాంకేతిక విభాగ (డిస్ట్రిక్ట్ టెక్నికల్ యూనిట్.. డీటీయూ) ప్రణాళికలో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది.

సుజలం భారత్ డేటాబేస్ (ఆర్‌పీడబ్ల్యూఎస్ఎస్ మాడ్యూల్)పైనా, మొబైల్ అప్లికేషన్‌పైనా డీడీడబ్ల్యూఎస్ అధికారులు ఒక ప్రజెంటేషన్‌ను ఇచ్చారు. ఇది 'మూలంలో నుంచి ఇంటి వరకూ' గ్రామీణ నీటి సరఫరా పథకాలకు సంబంధించిన ఒక సంపూర్ణ, జియో-ట్యాగ్‌ను కలిగి ఉండే డిజిటల్ రిజిస్టర్‌ని అందిస్తుంది. దీంతో బలమైన సార్వజనిక మౌలిక సదుపాయాలకు పునాది ఏర్పడుతుంది. పథకాన్ని ఏకీకరించడం, విశిష్ట సుజలం భారత్, సుజల్ గాంవ్ ఐడీని ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్లాట్‌ఫారమ్ మౌలిక సదుపాయాల్నీ, నిర్వహణ కార్యకలాపాల్నీ, నీటి నాణ్యతనీ, సేవలకు సంబంధించిన సమాచారాన్నీ సంధానిస్తుంది. ఫలితంగా క్రియాత్మక సాముదాయిక భాగస్వామ్యంతో పాటు మెరుగైన పారదర్శకత, జవాబుదారుతనం, పరిపాలనకు మార్గం సుగమం అవుతుంది.

సుజల్ గావ్ ఐడీ: గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థలకు సంబంధించిన ఒక ఏకీకృత డిజిటల్ రిజిస్ట్రీని రూపొందించడం

ఉదయం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆర్‌పీడబ్ల్యూఎస్ఎస్ మాడ్యూలు, సుజల గావ్ ఐడీ రూపకల్పనలతో పాటు సుజలం భారత్ యాప్.. వీటి ఆచరణీయ సాంకేతిక నిర్వహణాంశాలపైన దృష్టిని కేంద్రీకరించారు. ఆర్‌పీడబ్ల్యూఎస్ఎస్ ఐడీని తయారు చేయడానికి సంబంధించిన సాంకేతిక శిక్షణను ఎన్ఐసీ అధికారులు అందించారు. జేజేఎమ్ 2.0 డ్యాష్‌బోర్డులో ఐడీ రూపకల్పన తాలూకు పూర్తి ప్రక్రియను వివరించారు. తరువాత ప్రశ్నలు- జవాబుల కార్యక్రమాన్ని నిర్వహించారు.

తదనంతరం, సుజలం భారత్ మొబైల్ అప్లికేషనుకు సంబంధించిన సమగ్ర శిక్షణను చేపట్టారు. దీనిలో జియో-రిఫరెన్సింగ్ ప్రక్రియలు, గ్రామీణ నీటి సరఫరా కేంద్రాలను సుజలం భారత్ వేదికపై ఏకీకరించడమెలాగన్నది తెలియజేశారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చర్చలలో చురుకుగా పాల్గొని, నిర్వహణ, సాంకేతిక అంశాలపై వివరణలను కోరాయి.

రాష్ట్రాలు ఇప్పటికే మాడ్యూల్‌లో డేటాను పొందుపరచడంతో పాటు యాప్ ద్వారా కేంద్రాల జియో-ట్యాగింగును మొదలుపెట్టాయి. ఇది గ్రామీణ తాగు నీటి మౌలిక సదుపాయాల ఏకీకరణ, జీఐఎస్‌తో ముడిపెట్టిన డిజిటల్ అసెట్ రిజిస్ట్రీని ఏర్పాటు చేసే దిశగా కీలక ప్రగతిని సూచిస్తోంది.

జిల్లా సాంకేతిక విభాగాలు: ఉపయోగం ఆధారిత, సేవా ప్రధాన నమూనా వైపు మళ్లడం

మధ్యాహ్న కార్యక్రమాల్లో భాగంగా జిల్లా సాంకేతిక విభాగం (డీటీయూ) ప్రణాళికపై శ్రద్ధ తీసుకున్నారు. ఇది జల్ జీవన్ మిషన్ విస్తారిత దశలో భాగంగా ఒక వ్యూహాత్మక సంస్థాగత సంస్కరణకు ప్రాతినిధ్యాన్ని వహిస్తున్నది. డాడీడబ్ల్యూఎస్ అధికారులు డీటీయూపై ఒక సమగ్ర ప్రజెంటేషన్‌ను ఇచ్చారు.

జేజేఎం ప్రారంభ దశలో సార్వజనీన కుటుంబ నల్లా కనెక్షన్లను అందుకోవడానికి సత్వరం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యాన్ని ఇచ్చారు. అదే సమయంలో, తరువాతి దశకు వచ్చేసరికి దీర్ఘకాలిక పనితీరు, స్థిరత్వం, విశ్వసనీయ సేవల అందజేతపై దృష్టి సారించారు. డీటీయూను జిల్లా స్థాయి గ్రామీణ నీటి నిరన్వహణ తాలూకు సాంకేతిక వెన్నెముకగా లక్షించారు. ఇది జిల్లా జల, పారిశుధ్య మిషన్ (డీడబ్ల్యూఎస్ఎమ్)కు సంబంధించిన విస్తారిత సాంకేతిక శాఖలా పనిచేస్తుంది. ఈ ఫ్రేంవర్కు సంబంధిత విభాగాలతోనూ, నిపుణత కలిగిన సంస్థలతోనూ సమన్వయం నెలకొల్పుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. అలాగే పీహెచ్ఈడీ అధికారులు, నీటి నాణ్యత సిబ్బంది, సాంకేతిక సలహాదారుల వ్యవస్థ ద్వారా సాంకేతిక పర్యవేక్షణను ఇది సమర్థిస్తుంది.

డిజిటల్ పరిపాలన యంత్రాంగాల్ని స్వీకరించడం డీటీయూ ప్రణాళికలో ఓ కీలకాంశంగా ఉంది. దీనిలో అన్ని గ్రామీణ నీటి సరఫరా పథకాల్నీ సుజలం భారత్ జీఐఎస్-లింక్‌డ్ డిజిటల్ అసెట్ రిజిస్ట్రీలో సంధానించడంతో పాటు జల సేవా ఆంకలన్ (జేఎస్ఏ)కు నాయకత్వం వహించడం భాగంగా ఉంటాయి.

ఈ ఫ్రేంవర్కు నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు వ్యవస్థలో వైఫల్యాల్ని తగ్గించడానికి డిజిటల్ ట్విన్స్, ప్రిడిక్టివ్ ఎనలిటిక్స్, నివారణ ప్రధాన నిర్వహణ వ్యూహాల వంటి డిజిటల్ ఉపకరణాలను ఉపయోగించడాన్ని కూడా ప్రోత్సహిస్తుంది. జల సేవా ఆంకలన్‌లో డీటీయుల పాత్ర, బాధ్యతలను గురించి ఎన్‌పీ ఎంయూ-పీహెచ్ ఈ, ఎన్‌జేజేఎమ్ బృందం నాయకుడు శ్రీ అబ్‌సార్ ఖాన్ వివరంగా తెలిపారు. జేఎస్ఏ ఫార్మాట్ విస్తృత వివరణనూ అందించారు. దీని తరువాత ప్రశ్న లూ, జవాబుల కార్యక్రమాన్ని చేపట్టారు.

భారత్ పూర్తి స్థాయిలో డిజిటలీకరించిన, సేవల అందజేతలో సమర్థమైన జల సంబంధిత మౌలిక సదుపాయాల అనుబంధ విస్తారిత వ్యవస్థ దిశగా పురోగమిస్తున్న తరుణంలో, ఏ జనావాసాన్నీ పట్టించుకోకుండా ఉండరాదని ప్రభుత్వం నిబద్ధతను వ్యక్తం చేస్తోందని డీడీడబ్ల్యూఎస్ సంయుక్త కార్యదర్శి (నీరు) శ్రీమతి స్వాతి మీనా నాయక్ స్పష్టం చేశారు. ఆమె కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రతి ఒక్క బస్తీకీ ఎల్‌జీడీ కోడ్‌తో ముడిపడి ఉండే ఒక విశిష్ట డిజిటల్ గుర్తింపును కేటాయిస్తారనీ, అది అన్ని పథకాలకూ ఆధారభూతంగా ఉండే 'సుజల్ గ్రామ్ ఐడీ కి మదర్ ఐడీ'ని ఏర్పరుస్తుందనీ తెలిపారు. ఇది ఉన్నత పనితీరు కల డీటీయూ వ్యవస్థను ఉపయోగించుకొని రాష్ట్రం స్థాయిలో ఖచ్చితమైన, పురోగామి డిజిటల్ ట్విన్ ఆధారిత సిమ్యులేషనుకు మార్గాన్ని సుగమం చేస్తుందన్నారు. భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాలను సంధానించి విద్యుత్తు కంపెనీలు విశ్వసనీయతలోనూ, నిర్వహణ సామర్థ్యంలోనూ, ముందస్తు అంచనాతో కూడిన మరమ్మతులలోనూ ఉన్నత ప్రమాణాల్ని అందుకోగలుగుతాయని ఆమె వివరించారు. ఈ మార్పు సేవ స్థాయుల దక్షతను దాదాపు 100 శాతానికి పెంచుతుందనీ, ఇంజినీర్లకు అత్యాధునిక ఉపకరణాల హంగులను కల్పిస్తుందనీ, పారదర్శక, డేటా ఆధారిత నీటి సేవల అందజేత దిశగా దేశ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందనీ ఆమె ఉద్ఘాటించారు.

సీనియర్ అధికారులు జిల్లా స్థాయిలో వృత్తిపరంగా సాంకేతిక సహాయ వ్యవస్థల ప్రాధాన్యాన్ని చాటిచెబుతూ అభిప్రాయాల్ని పంచుకొన్నారు. మరికొందరు సీనియర్ అధికారులు కూడా ప్రసంగించారు. తరువాత చర్చా కార్యక్రమం ముగిసింది.

2047 కల్లా వికసిత్ భారత్ ఆశయ సాధనను దృష్టిలో పెట్టుకొని సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేయడం

కార్యక్రమం ముగింపులో, ఎన్‌జేజేఎమ్ డీడీడబ్ల్యూఎస్ అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టరు శ్రీ కమల్ కిశోర్ సొవాన్ ప్రసంగించారు. 2047వ సంవత్సరానికల్లా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి అనుగుణంగా శాశ్వత గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థలను అందించడంలో డిజిటల్ పారదర్శకత, సంస్థాగత పటిష్ఠీకరణ, సేవల స్థాయిపై ఆధారపడి ఉండే నిర్వహణలకు పెద్ద పీట వేయాలని శ్రీ సొవాన్ స్పష్టం చేశారు. డిజిటల్ నీటి నిర్వహణను బలోపేతం చేయడంపై జేజేఎమ్ దృష్టిని కేంద్రీకరిస్తోందనీ, మరమ్మతుల కోసం గొట్టపు మార్గాలను మూసివేయడం కావచ్చు... లేదా అంతర పథక అనుసంధానాలు కావచ్చు, లేదా ఆర్థిక సర్దుబాట్లు కావచ్చు.. 'మూలం నుంచి నల్లా వరకూ' సేవల సంపూర్ణ వ్యవస్థలో డేటా చోదకశక్తిగా ఉండే దృష్టికోణాన్ని జిల్లాలు అనుసరించాల్సిన అవసరం ఎంతయినా ఉందని ఆయన అన్నారు. మ్యాపింగ్, మూలానికి సంబంధించిన వివరాలు, నిర్వహణకు సంబంధించిన సమస్యలను విస్పష్ట సమాచారాన్ని అందించడంతో పాటు కాలానుగుణమైన దిద్దుబాటు చర్యలను కూడా చేపడితే ప్రతి ఒక్క కార్యకలాపాన్నీ సమంజసంగా, పారదర్శకంగా, దీర్ఘకాలం పాటు పథకం కొనసాగేలా చూడాలని తెలిపారు. నివారణ ప్రధాన వ్యవస్థలకు సంస్థాగత రూపాన్నివ్వడంతో పాటు క్షేత్ర బృందాలు, సాంకేతిక విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం ద్వారా 'మూలం మొదలు ఇంటి నల్లా వరకూ' సేవలలో అంతరాయాలను తగ్గించవచ్చని వివరించారు. దీంతో గ్రామీణ నీటి సరఫరా సేవలపై ప్రజలకు నమ్మకం బలపడుతుందన్నారు. జిల్లా కలెక్టరుకు డీటీయూ ఇన్‌ఛార్జి అధికారి రిపోర్టు చేస్తారనీ, డీటీయూ పనితీరునూ, తాగు నీటి సేవల అందజేతనూ క్రమం తప్పకుండా ప్రతి నెలా సమావేశాల్ని నిర్వహించి సమీక్షిస్తారనీ శ్రీ సొవాన్ వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడమే కాక పరస్పరం పంచుకోవాల్సిందిగా మాస్టర్ ట్రయినర్లందరికీ ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం, జిల్లా, గ్రామ పంచాయతీ స్థాయిలో ఫిబ్రవరిలో కనీసం ఒక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం దీనిలో భాగంగా ఉంటుంది.

శిక్షణ కార్యక్రమంలో పీహెచ్ఈడీ ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది, రాష్ట్రాలూ కేంద్రపాలిత ప్రాంతాల నుంచి నామినేషన్‌ను పొందిన సలహాదారులు పాల్గొంటారు. వారు ఇకపై రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో మాస్టర్ ట్రయినర్, రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరిస్తారు. దీంతో శిక్షణ కాలంలో తాము సంపాదించిన జ్ఞానాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, సంస్థాగతీకరించడానికి మార్గం సుగమం అవుతుంది. సుజల్ గావ్ ఐడీ, జిల్లా సాంకేతిక విభాగం ప్రణాళిక వంటి కార్యక్రమాల్ని నిర్వహించడం ద్వారా, దేశమంతటా గ్రామీణ తాగు నీటి సేవల అందజేతలో డిజిటల్ పరిపాలననీ, జవాబుదారుతనాన్నీ, దీర్ఘకాలిక స్థిరత్వాన్నీ ఈ విభాగం బలోపేతం చేయనుంది.

# ఉపాధి హామీ పని చేస్తుండగా వ్యక్తి మృతి

నల్గొండ, ఫిబ్రవరి 13: తుంగతుర్తి మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. కొత్తగూడెంకి చెందిన పగిడోజు రంగయ్య (66) రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని కెనాల్ దగ్గర ఉపాధి హామీ పని చేస్తుండగా అస్వస్థతకు గురై మృతి చెందాడు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

# 15,000 పాఠశాలలు, 500 కళాశాలల్లో కంటెంట్ క్రియేషన్ ప్రయోగశాలల ద్వారా ఏవీజీసీలో నైపుణ్యాభివృద్ధిపై సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వర్క్‌షాప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: న్యూఢిల్లీలోని జాతీయ మీడియా సెంటర్లో అత్యున్నత స్థాయి కన్సల్టేషన్ వర్క్‌షాపును సమాచార, ప్రసార (ఐ అండ్ బీ) మంత్రిత్వ శాఖ ఈ రోజు నిర్వహించింది. దేశ వ్యాప్తంగా 15,000 పాఠశాలలు, 500 కళాశాలల్లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ) ద్వారా కంటెంట్ క్రియేషన్ ప్రయోగశాలల్ని ఏర్పాటు చేయడానికి దీనిని నిర్వహించింది. భారతదేశాన్ని యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగానికి అంతర్జాతీయ కేంద్రంగా ఉంచడమే సృజనాధారిత దార్శనికతకు ప్రధానాధారమైన ఈ కార్యక్రమ లక్ష్యం.

ఈ కార్యక్రమంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు మాట్లాడుతూ, గతేడాది కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ (ఐఐసీటీ) కార్యకలాపాలు ఇప్పుడు ఎన్ఎఫ్‌డీసీ క్యాంపస్‌లో కొనసాగుతున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సమన్వయ సంస్థగా పనిచేస్తుందని అన్నారు. ఐఐసీటీకి అవసరమైన ప్రతిభావంతులను అందించే వ్యవస్థలుగా ఈ ప్రతిపాదిత ప్రయోగశాలలు పనిచేస్తాయన్నారు. ఈ ప్రయోగశాలల నమూనా, అవసరమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ మౌలిక సదుపాయాలు, వైవిధ్య విధానాలను అనుమతించే ఉమ్మడి వ్యవస్థ నిర్వహణకున్న అవకాశంపై కూడా సంప్రదింపులు నిర్వహించే అవకాశంపై ఇప్పటికే వివరణాత్మక సంప్రదింపులు పూర్తయ్యాయని ఆయన చెప్పారు.

నీతి ఆయోగ్, విద్యా మంత్రిత్వ శాఖ, నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వ శాఖ అధికారులు, బోర్డు/గవర్నింగ్ కౌన్సిల్స్/ అకడమిక్ కౌన్సిల్/ఆర్ అండ్ డీ కౌన్సిల్/స్కిల్ కౌన్సిల్, ఐఐసీటీ పారిశ్రామిక అభివృద్ధి కౌన్సిల్ సభ్యులు, రాష్ట్రాలు, పారిశ్రామిక సంఘాలు, విద్యాసంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అధునాతన క్రియేటివ్ స్టూడియోలుగా ప్రతిపాదిత ప్రయోగశాలలు పనిచేస్తాయి. పరిశ్రమ-ప్రామాణికమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లను ఉపయోగించి వృత్తిపరమైన నిర్మాణ ప్రక్రియలకు సంబంధించిన ప్రత్యక్ష అనుభవాన్ని విద్యార్థులకు అందిస్తుంది.

సృజనాత్మక రంగాల్లో విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించడం, ప్రత్యేక శిక్షణ అందించేలా ల్యాబ్ కార్యకలాపాలను జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)తో అనుసంధానించడం గురించి చర్చల్లో దృష్టి సారించారు.

అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి, సృజనాత్మక వ్యాపార వ్యవస్థను ప్రోత్సహించడానికి ఈ ల్యాబ్‌ల్లో మెంటార్‌షిప్ కార్యక్రమాలు, సొంత మేధో సంపత్తి (ఐపీ) సృష్టి అవసరమని స్పష్టం చేసింది.

దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా విస్తరించడానికి జాతీయ కార్యక్రమాలు, రాష్ట్ర విద్యా శాఖల మధ్య సమన్వయం ఉండటం చాలా ముఖ్యమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయ పడ్డారు.

విద్య, పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి, ప్రపంచ సృజనాధారిత ఆర్థిక వ్యవస్థకు భారతీయ యువత నాయకత్వం వహించేలా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ వర్క్‌షాపు ముగిసింది. చిన్ననాటి నుంచే సృజనాత్మక ఆలోచనలను, పరిష్కార నైపుణ్యాలను ఈ ల్యాబులు పెంపొందిస్తాయి. తద్వారా సాంకేతిక ఆధారిత సృజనాత్మక రంగాల్లో భవిష్యత్తులో వచ్చే కొత్త ఉద్యోగాలకు విద్యార్థులను సిద్ధం చేస్తాయి.

# ఏసీబీకి చిక్కిన డీటీ.. రూ.10 వేలు లంచం తీసుకుంటు పట్టివేత

అమరావతి, ఫిబ్రవరి 13: మసీదుకు చెందిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు లంచం తీసుకున్న డిప్యూటీ తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏపీలోని కడప జిల్లా పులి వెందులఆర్డీవో కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న నాగేంద్ర ప్రసాద్ రూ.10 వేలు తీసుకుం టుండగా దాడి చేసి పట్టుకున్నారు. చక్రాయపేట మండలం కుమారకాల్వ గ్రామంలో మసీదకు చెందిన 36 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మసీదు కమిటీ సభ్యులు అధికారులను సంప్రదించడంతో డీటీ లంచం డిమాండ్ చేశారు. బాధితుడు కరీముల్లా ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో నాగేంద్ర ప్రసాద్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ సీతారామారావు ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు.

# ప్రజల ఆశీస్సులతోనే ఈ విజయం..



నిజామాబాద్, ఫిబ్రవరి 13: నిజాంబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ ప్రజల ఆశీస్సులతోనే ఈ విజయం సాధించినట్లు 3వ డివిజన్ బిజెపి అభ్యర్థి 3వ డివిజన్ చింతా ప్రసన్న శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో మూడో డివిజన్ కమలం అభ్యర్థి భారీ విజయం సాధించడంతో విజయం సాధించిన అభ్యర్థిని శాలువాతో సన్మానించి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ ను ఉత్తమ డివిజన్ గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని అన్నారు.

# దేశంలోనే ఆదర్శంగా సైబరాబాద్ పోలీస్

## -కమిషనరేట్ ఆవిర్భావ దినోత్సవంలో సీపీ డాక్టర్ రమేశ

హైదరాబాద్, ఫిబ్రవరి 13: కేసులను ఛేదించడం, పోలీసింగ్, తదితర అంశాలను సాంకేతిక పరిజ్ఞానంతో సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సిస్టమ్స్, సైబర్ నేరాల దర్యాప్తు, ట్రాఫిక్ నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా సమర్థవంతమైన పోలీసింగ్‌ను నిర్వహించడంలో సైబరాబాద్ పోలీసులు దేశంలోనే ఆదర్శంగా నిలిచారని సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ రమేశ్ అన్నారు.

కమిషనరేట్ 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో సీపీ డాక్టర్ రమేశ్ జాతీయ పతాకాన్ని ఆవిషరించా రు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ?సైబరాబాద్ పోలీసుల వృత్తి నైపుణ్యాలకు జాతీయ స్థాయి పురసారాలు లభించాయన్నారు. సైబరాబాద్ ప్రాంతం దేశ జీడీపీకి గణనీయంగా తోడ్పడుతున్నదని, ఐటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఫార్మా, బయోటెక్నాలజీ, ఎంఎస్ ఎంఈలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగాల వృద్ధికి పోలీసులు కల్పించే భద్రతనే పునాది అని సీపీ వివరించారు. అనంతరం కమిషనరేట్ ప్రాంగణంలో మొకను నాటిన తరువాత సీపీ.. ధీర, వీర, ధ్రువ, భీమ, రాఖీ, తేజ, మౌని, లైకా పోలీసు జాగిలాల గౌరవ వం దనం స్వీకరించారు.

ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పోలీసు సిబ్బంది స్వచ్ఛం దంగా రక్తదానం చేశారు. ఫార్మేషన్ డే సందర్భంగా నార్సింగి సైకిల్ ట్రాక్ పై ప్రజలతో కలిసి పోలీసులు ప్రజలతో కలిసి సైక్లింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, ట్రాఫిక్-1 డీసీపీ రంజన్ రతన్ కుమార్, సీఏఆర్ హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్, ఇతర ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

